# ఆశీస్సులు

(వందో సంచిక సందర్భంలో..)





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



ప్రచురణ సంఖ్య: 159

కౌముది 100వ సంచిక సందర్భంగా స్పందనలు,
ఆశీస్సులు, అభినందనలు!!

**గొల్లపూడి మరుతిరావు - అతిథి సంపాదకీయం**

## *శతమానం భవతి*



అక్షరాన్ని ఆరాధించే అదృష్టవంతులు ఆ దంపతులు. సాహిత్యం వ్యసనం.ఆయన్ని పెళ్ళిచేసుకున్న కారణంగా ఆ వ్యసనాన్ని వ్యావృత్తి చేసుకున్న ఇల్లాలు ఆయన భార్య. ఇంతవరకు ఈ విషయాలు నాకూ వర్తిస్తాయి. కానీ సాహిత్యానికి ఒక వేదికని ఏర్పరిచిన ఉద్యమం ఆ ఇద్దరిదీను. ఇది వారికి మాత్రమే ప్రత్యేకత.

తెలుగుదేశంలో పత్రికను నడపడం ముందుగా డబ్బుతో కూడిన సమస్య. తర్వాత దాని పాపులారిటీ, రాబడి వగైరా. నాకు తెలిసి ఇంటర్నెట్ పత్రికని నిర్వహించడం విపరీతమైన కమిట్‌మెంట్. ప్రపంచంలో చాలా దేశాల, ప్రాంతాల పాఠకుల్ని సమీకరించడం. పత్రికకు రెండు కారణాలుగా ప్రాచుర్యం వస్తుంది. మొదటిది 'పాలన' – రెండవది 'నిర్వహణ'. మొదటిది సాహిత్యంలో ప్రమేయంలేని వారెవరో కేవలం వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకుని నడిపే వ్యవహారం. అలా కాకుండా సాహిత్యాభిమానంతో ఈ దేశంలో పత్రికను నడిపిన ముగ్గురు ప్రముఖులు నాకు కనిపిస్తారు – ప్రధానంగా – కాశీనాధుని నాగేశ్వరరావుగారు. అందుకే అలనాడు ఆంధ్రపత్రిక, భారతి చరిత్రను సృష్టించాయి. అలాగే ముట్నూరు కృష్ణా రావుగారి 'కృష్ణాపత్రిక'ని మరిచిపోలేము. తర్వాత కిన్నెర సంపాదకులు పందిరి మల్లిఖార్జున రావుగారు. రెండవది – అతి ముఖ్యమైన లక్షణం – నిర్వహణ. పాఠకునికి ఆ పత్రిక స్వభావం మీదా, ధోరణిమీదా, అభిప్రాయాల మీదా, వెరసి – 'వ్యక్తిత్వం' (తెలుగులో మరో మాట 'కేరెక్టర్'కి గుర్తురాక ఈ మాట వాడుతున్నాను) – చాలా ముఖ్య లక్షణం. పత్రికా రంగంలో కొన్ని పత్రికలు కొందరు పాఠకులకి వ్యసనమయిపోతాయి. అవి చదవనిదే తోచదు. నేను వారణాశిలో ఉన్న పదిహేను రోజులు అక్కడికి సాయంకాలం అయిదున్నరకి వచ్చే 25 'హిందూ' పేపర్లలో ఒకదాన్ని దక్కించుకోడానికి రిక్షాలో వెళ్ళేవాడిని. పత్రిక యొక్క ఈ 'కేరక్టరు' డబ్బు పెట్టి కొనేదికాదు. కేవలం ఒక వ్యక్తి జీనియస్సే సమకూర్చేదికాదు. తెలుగు దేశంలో నార్ల సంపాదకీయాలు, భారతి పత్రిక వ్యసనమయిన వారిని నాకు తెలుసు. ఏమిటి దీనికి పెట్టుబడి? పాఠకుని అభిరుచులతో జోక్యం చేసుకోని objectivity . పాఠకుని అభిరుచిని గౌరవించే డిగ్నిటీ. అన్నిటికీ మించి పాఠకుని మనస్సుని ఈ సంపాదకుడు గుర్తించి, గౌరవిస్తున్నాడనే స్పృహ. A successful periodical is essentially democratic and for that very reason, it practices autocracy. ఈ మాట ఆశ్చర్యంగా కనిపించవచ్చు. పసిబిడ్డ ఆనుపానులు ఎరిగిన తల్లి అత్యంత నిరంకుశంగా తన నిర్ణయాలను చేస్తుంది. తెలుగుదేశంలో మంచి ఉదాహరణ – స్వాతి.

నేను పత్రిక మంచి చెడ్డలను గురించి మాట్లాడడం లేదు. తన పాఠకుని గుర్తించిన పత్రిక నిరంకుశంగా ఆ పాఠకునికి సేవ చేయగలదు. It is the ego of a servant. సర్వెంటు అనే మాట యజమాని ఆనుపానులను ఎరిగిన సేవకునిగా పేర్కొంటున్నాను. ఈ పనిని అసిధారా వ్రతంలాగా నూరు నెలలుగా చేస్తున్న పత్రిక కౌముది. ఈ మాటని నేను సాధికారికంగా చెప్పగలగడానికి కారణం ఈ నూరు నెలలు వరస తప్పకుండా ఈ సంచికకి రచనలు చేయడం. నేను కౌముదికి పాతకాపుని.

అద్భుతమైన క్రమశిక్షణ, ఎవరినీ నొప్పించని ప్రసన్నత, ఆయా రచయితలను రచనలు పురికొల్పే కిరణ్‌ప్రభ 'ఎర', తనకంటూ నిర్దుష్టమయిన అభిప్రాయాలు ఉన్నా (ఉన్నవని నాకు బాగా తెలుసు) ఏనాడూ రచయితల అభిప్రాయాల జోలికి రాని కిరణ్‌ప్రభ 'మడికట్టుకునే ' సమయమనం – ఇది చాలా అరుదయిన objectivity. నేను రాసిన చాలా విషయాలు చాలా సందర్భాలలో ఆయన అభిప్రాయాలకు ఏ మాత్రం దగ్గరగా లేవని, ఉండవని నాకు తెలుసు. నాకు తెలుసునని ఆయనకీ తెలుసు. కానీ ఏనాడూ నా అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛకి భంగం రానివ్వలేదాయన. భంగం రానివ్వడని నా గర్వం. ఇలా రచయితల 'ఇగో'ని నీరు పోసి పోషించిన ఘనత కిరణ్‌ప్రభది. పత్రికలో వచ్చే రచననలలోని విషయాల 'ఫోకస్'కు ఏనాడూ వ్యక్తిగతమైన ముసుగు వెయ్యని గడుసయిన

సంపాదకుడు కిరణ్‌ప్రభ. అందుకు నేను ఆశ్చర్యపోయిన సందర్భాలూ, స్వేచ్ఛగా విశృంఖలంగా రాసిన సందర్భాలూ ఎన్నో ఉన్నాయి. నా స్వేచ్ఛ, అహంకారానికి అభ్యంతరంలేని రహదారి కిరణ్‌ప్రభ స్ట్రాంగ్ పాయింట్. అదే 'కౌముది ' స్ట్రాంగ్ పాయింట్ కూడా.

నన్ను చాలా తక్కువమంది ఒప్పించగలరు. నేను చాలా ఎక్కువమందిని నొప్పించగలను. ఈ రెంటినీ తూకంలో నిలిపిన సంపాదకుడు కిరణ్‌ప్రభ. ఎంతమంది రచయితలు! విషయంలో ఎంత విస్తృతి! ఒక యండమూరి, ఒక మల్లాది వెంకటకృష్ణమూరి, నేను, కొమ్మూరి సాంబశివరావు – వీరుకాక ఈ తరం రచయితలు. నవలలు, ఆత్మకథలు, ట్రావెలాగ్స్, కవితలు, వ్యాసాలు – ఇంత సమగ్రమైన కంప్లీట్ సంచికను నేను ఎరగను. నన్నెలా ఒప్పించారో – ఆరేళ్ళుగా ఏ వారం వరస తప్పక కాలం రాస్తున్నాను – కాదు – రాయించాడాయన. గమనించండి – మాస పత్రికలో వీక్లీ కాలం. ఏ ఒక్కరోజు ఆలశ్యమైనా – ఆయన పలకరిస్తాడు. నా క్రమ శిక్షణతో నిభాయించుకోగల మొదటి వ్యక్తి కిరణ్‌ప్రభ. Anyday, he can match my commitment and discipline. I find my match in him.

అన్నిటికన్నా గొప్ప ఉపకారం – రచయితలకి తమ రచనలకు దక్కే విస్తృతి. కౌముది ద్వారా – ఆశ్చర్యంగా – చాలా దేశాల తెలుగువారు నాకు అభిమానులయారు. ఇంతమంది ఈ పత్రిక చదువుతారని చాలాకాలం నాకు తెలీదు. ఫలానా కాలం 'ఇన్ని వేలమంది' చదివారని కిరణ్‌ప్రభ మధ్య మధ్య రెచ్చగొడతారు.

అన్నిటికన్నా ఈ పత్రిక విజయానికి గొప్ప వాటాదారు ఆయన శ్రీమతి. ఆవిడ చేతినుంచి రాకుండా బహుశా ఏ అక్షరమూ పత్రికలో చోటు చేసుకోదనుకుంటాను. రచయితలందరికీ ఆమె అభిమాని. ముఖ్యంగా నాకూ, మా ఆవిడకీ. ఈ దంపతుల కుటుంబం ఎన్ని దేశాలకు విస్తరించిందో!

ఈ నిరంతరమైన కృషిలో ఎంతో తృప్తినీ, మైకాన్నీ, అలౌకికమైన కమిట్‌మెంటునీ అనుభవించకపోతే ఈ పత్రిక ఇంతకాలం నిలవదు. Honesty is not a performance. వ్యక్తిగతమైన Job satisfaction డబ్బు, కీర్తి ఇవ్వగలిగేది కాదు. రోజూ పీల్చే గాలిలాగ, చేసే భోజనంలాగ, పలికే మాటలాగ – ఈ పత్రిక కిరణ్‌ప్రభ దంపతుల జీవనంలో ఒక భాగమయిపోయిందనడానికి ఈ నూరవ మజిలీ ఒక నిదర్శనం.

ఇది నిశ్శబ్ద విప్లవం. రచయితలకు అపూర్వమైన వేదిక. వీరు సమకూర్చిన గ్రంధాలయం ముందు తరాలకు ఇచ్చే సంపద. ఈ దశలో ఈ నూరవ సంచిక సంపాదకీయాన్ని కోరి తీసుకోవడానికి కారణం సోదర రచయితలు, రచయిత్రులందరి తరపునా ఈ కిరణ్‌ప్రభ దంపతులకు కృతజ్ఞతలు చెప్పడానికి. కొన్ని కొన్ని గొప్ప అనుభూతులను ప్రకటించడానికి కొన్ని మాటల శక్తి అరిగిపోతుంది. అలాగే 'కృతజ్ఞత' అనే మాట ఈ సందర్భంలో చాలా తేలికయినట్టు నాకనిపిస్తుంది. ఇది భావం ముందు భాష ఓడిపోయిన సందర్భం.

**అల్లు అరవింద్**



నేను ఇంటర్నెట్ పత్రికలు ఎక్కువగా చదువుతానని చెప్పను గానీ 'కౌముది' మాత్రం క్రమం తప్పకుండా చూస్తుంటాను. కారణం - మీ గురించి, మీ పత్రిక గురించి తరచూ వింటూ ఉండడమే. చాలా సందర్భాల్లో చాలామంది ద్వారా మీ గురించి వినడం జరిగింది. మీ ఇద్దరూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇంత సమగ్రమైన పత్రికని ఇన్నేళ్ళుగా నడపడం అన్న విషయం నన్ను చాలా ఆకర్షించింది. అందుకే సమయం దొరికినప్పుడల్లా 'కౌముది' చదువుతుంటాను

**మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## ఆశీస్సులు

ఒక భవనం అందంగా అనిపిస్తోంది అంటే, దానికింద ఉండే పునాది బలం అదృశ్యంగా దాక్కుంటుంది. ఇలాగే వంద సంచికల కౌముది వెనక ఎన్నో నెలల మథనం, ఆలోచన, శ్రమ, ఓపిక, శ్రద్ధ ఉన్నాయి. ఇది కిరణ్‌ప్రభ దంపతుల అభిరుచికి తార్కాణం.

కౌముది మాసపత్రిక నేడు తెలుగులో వచ్చే చాలా వార, మాసపత్రికల కన్నా రీడర్ ఫ్రెండ్లీగా వస్తోంది. దీంట్లో వచ్చే వివిధ శీర్షికలు కానీ, లబ్ధప్రతిష్ఠులైన రచయితల పేర్లు కానీ, నేడు అచ్చులో వచ్చే తెలుగు పత్రికల్లో మృగ్యం. ఇందుకు కారణం కిరణ్‌ప్రభగారికి పాఠకుల అభిరుచి మీద అవగాహనే అని నేను నమ్ముతాను. పారితోషికం ఇవ్వకపోయినా, వీరంతా తమ రచనలని కౌముదికి అందించడానికి కారణం కౌముది మీది గౌరవంతోపాటు, కిరణ్‌ప్రభ దంపతుల మీదగల ప్రేమ. రచనల నాణ్యత విషయంలో రాజీపడకుండా ఎంపిక చేయడంవల్ల మనం ఇందులో మంచి రచనలు చదవగలుగుతున్నాం. యద్దనపూడి సులోచనారాణి, శ్రీధర, కంఠంనేని రాధాకృష్ణమూర్తి, గొల్లపూడి మారుతీరావు, జలంధరలాంటి రచయితల రచనలని కౌముదిలో వచ్చాయి. నిషిగంధ, ప్రవీణ కొల్లి, మధురవాణి, మణి వడ్లమాని, సాయిపద్మ, సన్నిహిత్ లాంటి కొత్త వారి రచనలని కూడా కౌముది ప్రచురించింది. మొదటి సినిమా, ఆ పాటమధురం, లక్షా డెబ్బై వేల పెట్టుబడితో, మళయాళంలో రిలీజై అక్షరాలా రెండుకోట్లు ఆర్జించిందిలాంటి ఎన్నో తమాషా సినీ విశేషాలు చిత్రకదంబం శీర్షికలో చదివాను.

'కౌముది ఏనాటికైనా అచ్చులో వెలువడితే, బావుంటుంది' అన్నవారు నాకు తారసపడ్డారు.

ఎలాంటి ఆర్థిక లాభాపేక్ష లేకుండా, పదిమందికి వినోద విజ్ఞానాలని పంచాలనే సదుద్దేశంతో శ్రీ కిరణ్‌ప్రభగారు, శ్రీమతి కాంతిగారూ తమ సమయాన్ని వెచ్చించి దీన్ని వంద సంచికలు ఠంచనుగా ఒకటో తారీఖుకి అందించడం వారి నిబద్ధతని తెలియచేస్తోంది.

అమెరికా, ఇంగ్లాండ్, ఇండియా, కువైట్‌లాంటి ఎన్నో దేశాల నుంచి కౌముదికి తమ రచనలని అందించేవారిని కూడా అభినందించి తీరాలి. కిరణ్‌ప్రభ జంటకి అభినందనలు.

వంద సంచికలు పూర్తిచేసుకున్న కౌముది ఇలాగే నిర్విఘ్నంగా కొనసాగాలని ఆశిస్తున్నాను.

❀❀❀❀

**యండమూరి వీరేంద్రనాథ్**



I have been associated with KOUMUDI since past 8 years and above. As an editor of a weekly in early stages of my life, I understand how difficult to run a magzine, that too without commericial element. I congraculate the Editor Mr. Rao and particularly his wife, for the zeal and enthusiasm in uplifting our culture.

❀❀❀❀

**వసుంధర**

*కౌముది కాంచనిచో కవి కాంచునే కదా!*



పచ్చని చెట్లు. పూలమొక్కలు. మెత్తని పచ్చిక. చల్లని గాలి. సాయంసమయం.

విశ్రాంతికి వచ్చిన వార్ధక్యం. ఉత్సాహం నింపుకున్న యువత. వినోదాన్ని పొందుతున్న బాల్యం.

పార్కులో ఓ బెంచిమీద కూర్చుని ఆ మినీ ప్రపంచాన్ని పరిశీలనగా చూస్తున్నాడు కవి.

వాటంతటవే దీపాలు వెలగడంవల్ల క్రమంగా చీకటి పడుతున్నా అతడికి తెలియలేదు. కానీ పవర్‌కట్ ధర్మమా అని ఉన్నట్లుండి దీపాలు ఆరిపోవడంతో– అతడికి కళ్లు చీకట్లు కమ్మాయి.

ఒక్క క్షణం, అంతే! అంతలోనే పార్కు దేదీప్యమానంగా వెలిగిపోతున్నట్లు అనిపించింది కవికి. చుట్టూ చూస్తే...

దీపాలు వెలగడం లేదు. ఆకాశంలో అమావాస్య చీకట్లు అలముకుని ఉన్నాయి. పార్కు ఒక్కటే ప్రకాశవంతమై ఉంది. ఆ కాంతి తన పక్కనుంచే ఓ దివ్య పురుషుడి తనువునుంచి వస్తోంది.

''నేను రవిని. నీతో మాట్లాడాలని మనిషి రూపం ధరించి ఆకాశంనుంచి దిగి వచ్చాను" అన్నాడా దివ్యపురుషుడు.

కవి అప్రయత్నంగా రవికి నమస్కరించి చుట్టూ చూస్తే– అక్కడున్న జనంలో ఎవరూ రవినీ, అతడి తేజాన్నీ గమనించినట్లు తోచలేదు.

''అంటే నువ్వు నాకు మాత్రమే కనిపిస్తున్నావా?" అన్నాడు. రవి తలూపగానే, ''నాతో ఏం మాట్లాడతావు?" అనడిగాడు.

''నేను చూడనిది కూడా నువ్వు చూస్తావని విన్నాను. ఎలా చూస్తావు?'' అన్నాడు రవి.

''నీ కిరణప్రభలు మనుషులను తాకుతాయి. కవి కిరణప్రభలు మనసుల లోతుల్ని స్పృశిస్తాయి'' జవాబిచ్చాడు కవి.

''అదే, ఎలా?'' అడిగాడు రవి.

"నువ్వు కుంతిమీద మనసుపడి నీ సరదా తీర్చుకున్నావు. ఆమెకో కొడుకునిచ్చి, కన్యాత్వం చెడకుండా వరమిచ్చి దాంతో ఏ సమస్యా ఉండదనుకున్నావు. అంతే నువ్వు చూడగలిగింది. కానీ కవి ఆ ఘటనలోంచీ మహాభారత కావ్యాన్ని దర్శించి జనాలకు అందించాడు. ఆతర్వాతనుంచి నీలాంటి మంచివాళ్లు ఆడపిల్లల జోలికెళ్లేముందు కాస్త ఆలోచిస్తున్నారు. ఆడపిల్లలు కూడా నీలాంటి మంచివాళ్ల విషయంలోనూ కాస్త ఆలోచించడం నేర్చుకున్నారు. నీకూ, కవికీ ఉన్న తేడా అదే!''

రవి తల అడ్డంగా తలూపి, ''మహాభారతాన్ని రచించింది వేదవ్యాసుడు. ఆయన మహాతపస్వి. తపోశక్తితో ఆయన నేను చూడనిది కూడా చూసి ఉండవచ్చు. కానీ ప్రతి కవీ అలా చూడలేడు'' అన్నాడు.

''రచన ఒక తపస్సు. కవి ఒక తపస్వి. నాచేత చెప్పించాలని కానీ, ఇది నీకు తెలియదనుకోను'' అన్నాడు కవి.

''ఐతే ప్రతి కవీ ఒక వేదవ్యాసుడనీ, ప్రతి రచనా ఒక మహాభారతమనీ అంటావు!'' అన్నాడు రవి.

కవి నవ్వి, "దీనికి నేను ఔనూ అంటాను, కాదూ అంటాను. నీ విషయమే తీసుకో! నువ్వు ఒకేఒక్క సూర్యుడివి. కానీ సమస్త జీవులకూ ఒకొక్కడిగా కనిపిస్తావు. అలాగే కవులూనూ. విడివిడిగా కనిపిస్తూ వాళ్లు చేసే విడివిడి రచనలన్నీ కలిపితే– అది మహాభారతం ఔతుంది" అన్నాడు.

"ఎలా?''

'"మహాభారతంలో మంచి–చెడు, స్వార్థం–త్యాగం, భక్తి–రక్తి, ప్రేమ–ద్వేషం, అగ్రకులాధిపత్యం–దళితవాదం, రాజరికం–సామ్యవాదం, పురుషాధిక్యం–స్త్రీవాదం, ఆస్తికత్వం–నాస్తికత్వం, విప్లవం–శాంతి వగైరాలన్నీ ఉన్నాయి. కథ ఉంది, కవిత ఉంది. పాత్రలు, సన్నివేశాల్లో అభూతకల్పనలు, వాస్తవాలు కూడా సమతూకం. ఈ ప్రపంచాన్ని సమగ్రంగా ప్రదర్శించిన అపూర్వ సాహితీ ప్రయోగమది.

అలా నీ కిరణప్రభలు కాంచని ప్రపంచ విశేషాల్ని ఎందరో కవులు గమనిస్తే– ఓ కిరణ్‌ప్రభ వాటిని సమగ్రం చేసి ప్రదర్శిస్తే ఆ ప్రయోగం మహాభారతానికి తీసిపోతుందా?"

''అర్థమైంది. నువ్వు చెప్పేది అంతర్జాల మాసపత్రిక కౌముది గురించి! ఔనా?" అన్నాడు రవి.

''తెలుగునాట ఇన్ని పత్రికలుండగా, ఈ సందర్భంలో నీకు కౌముదియే ఎందుకు స్ఫురించింది?" అన్నాడు కవి ఆశ్చర్యంగా.

''భువినుండి వచ్చిన సాహితీ దిగ్గజాలెందరో దేవలోకంలో కౌముదిని స్మరిస్తున్నారు. అది ఏ భావజాలానికీ కట్టుబడకుండా, సాహితీ విలువలకు ప్రాధాన్యమిచ్చే సమగ్ర పత్రిక అని వాళ్లు ముచ్చటించడం నేను విన్నాను. పత్రికలంటే జ్ఞానసూర్యతేజాన్ని ప్రసన్నం జేసే చలువ కళ్లజోళ్లని తెలుసు కానీ, నేను చూడనిది కూడా చూపించగలవని నాకప్పుడు స్ఫురించలేదు"

కవి నవ్వి, "కౌముదిలో నాణ్యమైన కథలున్నవి. కవితలున్నవి. వ్యాసాలున్నవి. నవలలున్నవి. సినీవలలున్నవి. లలిత, చలనచిత్ర సంగీత విషయములున్నవి. అనుభవజ్ఞుల అపూర్వ విశేషాలున్నవి. ప్రతిభావంతుల విశ్లేషణలున్నవి. కనిపించే విడియోలున్నవి. వినిపించే ఆడియోలున్నవి. అనిపించే ఆహాలున్నవి. పాతవారికి ఉత్సాహమున్నది. కొత్తవారికి ప్రోత్సాహమున్నది. వినోదమున్నది. విషాదమున్నది. అన్నీ కలిపి అర్థవంతమైన సాహితీ ప్రపంచమున్నది. భావనాతరంగాలకు చెలియలికట్ట తగదను అంతర్జాల వేదిక ఉన్నది. ఇన్నింటిని కూడగట్టిన కిరణ్‌ప్రభా తేజమున్నది. ఆ తేజము నీ తేజమువలె దుర్నిరీక్ష్యము కాదు. కౌముదియై నెలనెలా ప్రతి ముంగిట్లోనూ వెలసే సాహితీ చంద్రిక. జ్ఞానానికి ప్రతినిధివైన నీకీ విషయం తెలియకపోవడం ఆశ్చర్యముగా నున్నది" అన్నాడు కవి.

అప్పుడు రవి కూడా నవ్వి, "ఎంతటి జ్ఞానులకైనా తెలిసినట్లు అనిపించే విషయాలు కొన్ని చెప్పేదాకా తెలియవు. జ్ఞానానికి ప్రతినిధినైన నేను చూడలేనిది కూడా నువ్వు చూడగలవు కదా! చూసింది చూసినట్లు ఈ మాట కౌముదికి చెప్పొచ్చు కదా! ఉన్నమాటే అయినా ఎవరికైనా ప్రశంస ఇచ్చే ఆ కిక్కే వేరు" అన్నాడు.

"ఔననుకో. కానీ అసలుసిసలు తెలుగువాణ్ణి. లోపాలెన్నమంటే ఎప్పుడుపడితే అప్పుడు రెడీ. కానీ మెచ్చుకోవాలంటేనే, ప్రత్యేక సందర్భమంటూ ఉండాలి కదా అనిపిస్తుంది"

"దాందేముంది? వచ్చేదే కౌముది నూరవ సంచిక. అది ప్రత్యేక సందర్భమే కదా!"


"ఏమో, నాకలా అనిపించడం లేదు. ప్రతి నెలా ప్రత్యేక సంచికలాగే ఉంటుంది కౌముది"

''కానీ పాపం, కౌముదికా విషయం తెలిసినట్లు లేదు. నువ్వయినా ఆ విషయం చెప్పి ఆ అజ్ఞానాన్ని తొలగించు. అప్పుడు కౌముది కాంచనిచో కవి కాంచునే కదా అని అంతా నీ గురించి గొప్పగా చెప్పుకుంటారు" అని మాయమయ్యాడు రవి.

కవి ఇంటికొచ్చి లాప్‌టాప్ తీసి అంతర్జాలంలో కౌముది మాసపత్రికను తెరిచి– వచ్చే సంచికతో కౌముది 100 సంచికల మైలురాయిని చేరుకుంటోందన్న– ప్రకటన చూసి, "రవి చెప్పింది నిజమే! కౌముదికి తన గురించి తనకే తెలియదు" అని నవ్వుకుని ఆ విషయం కాగితంమీద పెట్టడానికి ఉద్యుక్తుడయ్యాడు....

బాలి

## అందమైన 'కౌముది'



**'కౌముది' చాలా అందమైన పేరు.** నెలనెలా వస్తున్న వెన్నెల – నిండు చందమామ తరుగునాడు – పెరుగునాడూ వస్తున్న వెన్నెలకన్నా పున్నమి చందమామ అందమే వేరు –

ఈ 'కౌముది' వెబ్ మాసపత్రికను తెలుగుదేశం నడిబొడ్డున లేక తెలుగుదేశంలోనే చదవడం కన్నా ఏ విదేశాలలో ఉన్నపుడు తెలుస్తుంది దాని గుబాళింపు ఏమిటో? ఈ చెలికాని తోడు ఏమిటో –?

తెలుగు భాషలోని మధురిమలు మనస్సుకి అందుతూ, మాతృదేశపు మట్టివాసనలు నాసికకు సోకుతూ మళ్ళీ ఇంటి ప్రాంగణంలోకి అడుగుపెట్టానన్న భ్రమ –

వడ్డించిన విస్తరి అందులోని శీర్షికలు — రచనలూ. ఏది ముందు చదవాలో (తినాలో) తెలియదు కమ్మని తెలుగుపోకడల సోహాళింపు–

"తెలుగు తల్లిని రక్షించుకోవాలి"

"తెలుగు భాషకు పునర్వైభవమే ధ్యేయంగా, లక్ష్యంగా సాగాలి"

మొన్న ఫిబ్రవరి 21, 22 వ తేదీలలో విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగురచయితల మూడవ సభకు రెండు రోజుల ముందు పేపర్లలో అక్కడక్కడా ప్రముఖులు పలికిన పలుకులంటూ వేశారు.

చదివాను –

అంటే ఇంగ్లీషు మాధ్యమం ప్రజల్లో (ముఖ్యంగా విద్యార్థులలో) పెరుగుతున్న చదువుల వల్ల మన మాతృభాషను చదవనూ, వ్రాయనూ మరచిపోతున్నారన్న భావనవల్ల, ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజలను చైతన్యపరుస్తున్నారని నాకనిపించింది. మంచిదే – అయితే అది ఎన్నాళ్ళు – (కాలవాహినిలో మార్పు సహజం కదా) అది ఉత్తుత్తి తాటాకుల మంట కాకూడదు కదా!

ఆ రెండు రోజులూ గడిచిపోయాయి

మరి కొద్ది రోజుల్లో సభలు ముగిశాయి –

అయితే ఆ తరువాత ఆ మహాసభలో అడుగుపెట్టి – మొత్తం ఉపన్యాసాలు, అది విన్న వారి స్పందన, అభిప్రాయాలూ, అనుభవాలూ ఎలా ఉన్నాయో తెలియదుగానీ ఈ రోజు నా చేతిలోకి ఓ "సాహిత్య, సాంస్కృతికోద్యమ మాసపత్రిక" అని ముఖపత్రం మీద రాసుకున్న ఓ పత్రిక వచ్చింది. అయితే ఇది ఎర్రపతాకం నీడలో మసలుతున్న పత్రిక – దీనిలో ప్రతి నాలుగో పేజీలో "బూర్జువాలూ, బడుగు వర్గాలూ, వర్గపోరాటాలూ" అనే పదాలు అడుగు వేసినపుడల్లా పాదాలకు పల్లేరు కాయల్లా గుచ్చుకుంటున్న మధ్య పేజీల్లోకి వచ్చేసరికి విజయవాడలో జరిగిన "ప్రపంచ రచయితల సభలెలా జరిగాయంటే – "అనే వ్యాసం కనపడింది.

సరే! ఎంతో కొంత విషయం తెలుస్తుంది కదా! అని చదివాను "ఇలా ఉంటే బాగుండేది" అనే సూచనలు ఇందులో ఎక్కడా కనపడలేదుగానీ సభాస్థలికి విశ్వనాథ సత్యనారాయణ నగర్‌గా పేరు పెట్టారన్న విషయం దగ్గర్నుండి, సభా ప్రసంగాలలో స్తోత్కర్షలు ఎక్కువయాయి అంటూ భాజాపా నాయకుడు, కేంద్రమంత్రీ అయిన వెంకయ్య నాయుడు దగ్గర్నుండీ – నిన్నటిదాకా కాంగ్రెస్ మంత్రిగానూ, అధికార భాషా సంఘు అధ్యక్షునిగానూ ఉండి, ప్రస్తుతం తెలుగుదేశపు రాష్ట్రప్రభుత్వ ఉపసభాపతిగా పదవిలో ఉన్న మండలి బుద్ధప్రసాద్ దాకా తెలుగు భాషకు పట్టిన నేటి దురవస్థకు, ఎవరో భాధ్యులన్నట్లూ ప్రభుత్వాలది మాత్రం బాధ్యత కాదన్నట్లూ మాటల గారడీ చాతుర్యాన్ని ప్రదర్శించారని రాసి, ప్రజల ధనంతో (రాష్ట్ర సాంస్కృతి శాఖ వారి పది లక్షల ధనసహాయంతో) ఈ సభలు నిర్వహించే అధికారం వీరికెవరిచ్చారో అని ఇంకా రెండు, మూడు మాటల తూటాలు పేల్చి వ్యాసం ముగించారు.

అయితే ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే "ఈ తీయని తెలుగు భాషను ప్రభుత్వం రక్షించాలా? లేక ప్రజలే రక్షించుకోవాలా?" అని ఈ మధ్య తరచూ వింటున్నాను – "అమెరికాకు, ఆస్ట్రేలియా, కెనడాలకులకు వెళుతున్న వారు తెలుగును మరచిపోతున్నారని" –

నిజంగా మరచిపోతున్నారా!?

అదే నిజమయితే భాషను మరచిపోయేవారూ, మరచిపోయినట్టు నటించే వారూ ఇక్కడ మాత్రం లేరూ –

ఇష్టం లేకపోతే, అందులోని మాధుర్యాన్ని గ్రహించలేకపోతే అక్కడున్నా మరిచిపోతారు.

పక్కనున్న పెద్దవారు తెలియచెప్పడంలోనే ఉంది అంతా!!

మాతృభాష మీద మమకారం ఉన్నవారెవరూ మరచిపోరు. పిల్లలకు తెలుగుభాషలోని కమ్మదనం, అందమూ, అభిరుచి కలిగిస్తూ "అఆలు" దిద్దిస్తున్నవారెందరో ఉన్నారు –

అంతర్జాలంలో ఉన్న పత్రికల పుణ్యమా అంటూ కొంతలో కొంత విషయము దూరప్రాంతాలవారి కందుతోంది. అయితే ఆ పత్రికల్లో కూడా చిత్తశుద్ధి ఉండాలి. కొన్ని చదివే పట్టు ఉండవు. లోన కంటెంట్ మారదు. కొండకచో భాషా దోషాలు – లేకపోతే ఏదో ఒక "ఇజానికి" లోబడ్డవి కొన్ని –

పైనున్న సమస్యలు లేకుండా ఠంచన్‌గా ఒకటో తారీఖుకి కొన్ని గంటలముందే వెబ్‌లో కనపడే పత్రిక 'కౌముది ' – దానికో చక్కటి ముఖచిత్రం. దాని అర్థాన్ని అద్దం పట్టే ఆ పక్కనే మధురమైన కవిత. ఇప్పటికి 99 పత్రికలు అంటే 99 నెలలుగా వస్తూ ఈ 100వ సంచికలోకి అడుగుపెడుతున్న పత్రిక! – పత్రికకు ఉండవలసిన చక్కటి లక్షణాలతో షడ్రుచులూ అందించే పత్రిక ఇది.

"చదువుతోంటే.. అమ్మో! అపుడే అయిపోతోందని దాచుకుని దాచుకుని, ఆఫీసు నుండి రాగానే ఫ్రెష్ అయిపోయి వేడి వేడి టీ తాగుతూ కొంచెం కొంచెం చదవాలనిపిస్తుంది" ఈ మాట అమెరికాలో ఉన్న మా అమ్మాయి తరచూ చెప్పేదే!!

అందులో రాసే వాళ్ళంతా హేమా హేమీలే.

వారందరి రచనలు సేకరించి – ఒక వరుసలో పేర్చాలంటే ఎంత కష్టం సంపాదలకు! కానీ వారు ఇదేదో భాషా సేవ చేస్తున్నామనడంలేదు. ప్రభుత్వం మాకు మరికొంత చేయూతనందిస్తే అని కూడా అనడంలేదు.

తెలుగు తెలుగే! – మమకారం మమకారమే!!

కథలు, సీరియల్సూ, జోకులు, కార్టూన్‌లూ, పుస్తక పరిచయాలు – పాఠకుల అభిప్రాయాలూ, సంపాదకుల ముందు మాటలూ, ముఖచిత్రంపై కవితాఝురి, ఒకటా! రెండా, ఇంకా ఎన్నో రుచుల వంటకాలతో వడ్డించిన విస్తరి.

ఇంత చక్కగా నడపాలంటే ఎంత ఓపిక కావాలి – భాష పట్ల ఎంత మమకారం ఉండాలి — ఎంత సేకరణ చేయాలి. ఒక్క ముఖచిత్రమే తీసుకుంటే చాలు అద్భుతమైన కంపోజిషన్, చక్కటి పెరస్పెక్షన్ – రవ్వంత ప్రతిఫలం ఆశించకుండానే –

ఇవన్నీ చాలవన్నట్టు కథల పోటీలు నడపడం, వాటికి ప్రతిఫలం చెల్లించడం. ఇదంతా 'కిరణ్‌ప్రభ'గారూ వారి శ్రీమతీ ఒంటిచేత్తో లాక్కొస్తున్నారంటే తెలుగు భాష మీద మమకారం లేదంటారా? ఇదంతా భాషా సేవేకదా! విదేశంలో ఉంటూ తెలుగు భాషను మరచిపోతున్నారన్న వారిని ఏమనాలి – ఇక్కడ ఉంటూ మమ్మీ – డాడీ అని పిల్లలతో పిలిపించుకుంటున్నవారినేమనాలి?

చివరిగా చిన్న మనవి –

'కౌముది'ని చదివేసినా, చివరిలో కిరణ్‌ప్రభగారి టాక్‌షోను వినండి. ఆయన గొంతులోని మాధుర్యంతో పాటు విషయాన్ని చక్కగా 'కౌన్సిలింగ్' చేస్తూ మీ హృదయానికి హత్తుకోవడం తెలుస్తుంది.

బలభద్రపాత్రుని రమణి

# కౌముది సాక్షాత్కారమైన వేళ



జీవితంలో అద్భుతాలన్నీ అకస్మాత్తుగా జరిగేవే కానీ అనుకుని పథకం వేసుకుంటే జరిగేవి కావు. భమిడిపాటి ఫణిబాబు అనే పెద్దాయన నాకు మొదటిసారి కౌముది గురించి చెప్పి కిరణ్‌ప్రభగారికి పరిచయం చేసారు. లబ్ధ ప్రతిష్టులైన రచయితలు గొల్లపూడిగారు, యద్దనపూడిగారూ, వీరేంద్రనాథ్‌గారూ, మల్లాదిగారూ లాంటివాళ్ళు కౌముదిలో వ్రాస్తున్నారు. కిరణ్‌ప్రభగారు మొదటిసారి మాట్లాడినప్పుడే, ఎన్నో ఏళ్ళుగా పరిచయం ఉన్న ఒక బంధువు లేక సోదరుడూ, చాలా ఏళ్ళకి పలకరించినట్లు అనిపించింది కానీ కొత్తగా అనిపించలేదు.

ఆ తరువాత వంగూరి చిట్టెన్‌రాజుగారికి, వంగూరి ఫౌండేషన్ ఆరవ మహాసభలకి గెస్ట్‌గా నన్ను పిలవమని కిరణ్‌ప్రభగారు రికమెండ్ చెయ్యడం, ఆ మహాశయుడి పరిచయం, మొదటిసారి జూన్ నెలలో 2008లో నేను హడావిడిగా బట్టలు పెట్టెల్లో సర్దుకుని అమెరికా గడ్డమీద కాలు పెట్టడం, సభలూ, సమావేశాలూ, నేనూ, గొల్లపూడిగారూ, ఆయన శ్రీమతిగారూ కిరణ్‌ప్రభగారింట్లో బసచేసి, (వారి కుటుంబాలకి అప్పటికే బాగా స్నేహం, కాంతికిరణ్‌ని గొల్లపూడిగారు కూతురంటారు) సాహితీ సమావేశాలూ, సాహితీ ప్రయాణాలూ, సాహితీభోజనాలూ ఇత్యాదులు చేసేసాం.

వంగూరి వారి సభలయ్యాక ఆ అమాయకపు సాహితీ కర్షకుడు, ఇంతమందికి వ్యవసాయం చేసి ఫలసాయం అందిస్తున్నారే కానీ, ఎవరూ ఒక గొంగళి కప్పి సన్మానించలేదే అని నేను బెంగపడి, కిరణ్‌ప్రభ గారింట్లో హాల్లో నుండి పైన బెడ్‌రూమ్స్ కి వెళ్ళే మెట్ల మీద కూర్చుని మొదట వ్యాసం 'సాహితీసదస్సు' వ్రాసాను. అందులో చమత్కారానికీ, నా శైలికీ కాంతి, కిరణ్‌ప్రభ దంపతులు ఆనందపడి, ఆ కాలం కొనసాగించమని కోరారు.

అలా నా సాహితీ ప్రస్థానం ఆగస్టు, 2008లో మొదలయి, ఈ వందో సంచిక ఏప్రిల్ 2015 దాకా సాగుతూనే ఉంది. మూడు సార్లు అమెరికా వెళ్ళాను. ఈ కౌముది వల్ల నా కుటుంబ సభ్యులూ, నా వ్యక్తిగత వృత్తిగత జీవితం, పాఠకులకి హాస్యంగా పరిచయం చేసే అవకాశం దక్కింది. ఎక్కడికెళ్ళినా 'అక్కా' అనో, 'చెల్లీ' అనో ఆప్యాయంగా పలకరించి ఆతిధ్యం ఇచ్చే ఆత్మబంధువులు ప్రపంచం నలుమూలలా దొరికారు.

నన్ను చూడగానే నా నవలలూ, కథలు గురించి మాట్లాడేవారు సీరియస్‌గా మాట్లాడేవారు, ఇప్పుడు మొదట నవ్వి, తరువాత "మీవారు ఆన్‌లైన్ షాపింగ్ ఇంకా చేస్తున్నారా?", "మీ డ్రైవర్ కాంతారావ్ బాగున్నాడా?"

"మీ అమ్మగారికి ఇంకా కలలొస్తున్నాయా?"లాంటి పర్సనల్ విషయాలు చనువుగా అడిగి 'మేము కౌముది పాఠకులం' అంటున్నారు.

ఈ కౌముది వల్ల నాకు అమెరికాలోని, కాలిఫోర్నియాలోని డబ్లిన్‌లో పుట్టిల్లు దొరికింది.

ఈ 'వందసంచికల పండగ'లో నేనూ 79 వ సంచికలు కలిసి ప్రయాణించడం చెప్పలేనంత ఆనందంగా ఉంది.

కిరణ్‌ప్రభగారంటే..కౌముది.

కిరణ్‌ప్రభగారంటే...ఓ.. క్రమశిక్షణ

కిరణ్‌ప్రభగారంటే ఓ... గంగాఝరీ ప్రవాహం.

కిరణ్‌ప్రభగారంటే ఓ స్వచ్ఛమైన తెలుగు వాచకం.

కిరణ్‌ప్రభగారంటే ఓ అందమైన ఛాయాచిత్రం కావ్యం!

కిరణ్‌ప్రభగారంటే ఓ సాహితీబంధు!

కిరణ్‌ప్రభగారంటే నిండు వ్యక్తిత్వానికి దర్పణం

మరి నా స్నేహితురాలూ, కో ఎడిటర్ కాంతికిరణ్ గురించో..

ఆయనలో సగం. అరవైమంది సిబ్బంది పత్రికాఫీసులో చేసే పని వీరిద్దరే చేస్తారు. ఏ విషయం చెప్పినా "మా ఆయన చెప్పలేదుగా?" అనే సహధర్మచారిణి, ఆయనకి తగిన అర్ధాంగి. అతిధులని ఆదరించడం, స్నేహం చేస్తే ప్రాణం పెట్టడం, మనసారా ఇతరుల్లో ప్రతిభని మెచ్చుకోవడం, చిన్న చిన్న విషయాలకే పొంగిపోయే అల్పసంతోషిత్వం, అమృతప్రాయమైన భోజనం పెట్టడం, మధురమైన సంభాషణలు చెయ్యడం ఆవిడకి వెన్నతో పెట్టిన విద్యలు. కవర్‌పేజీని అందంగా తీర్చిదిద్దే భావసౌందర్యం ఆవిడ ఆస్తి.

వారిరువురికీ రానివి ఇతరుల గురించి చెడు మాట్లాడడం, ఎవరినైనా నొప్పించడం, ఏది అడిగినా 'కాదు' అనలేకపోవడం.

ఈ ఎడిటరూ, కో – ఎడిటరూ ఒక యజ్ఞంలా ప్రతి ఒకటో తారీఖు సాయంత్రం (మన భారతదేశంలో ఉదయం) కౌముది వెన్నెలని ఆవిష్కరించి, ఆ వెలుగులో చల్లదనంలో మనని విహరింప చేస్తున్నందుకు, ఈ సాహితీ మూర్తులకి ఆ 'భారతి' తన కృపాకటాక్షాలు ప్రసరించి వీరి జీవితాలని కచ్చపినాద సమ్మేళిత సుస్వర జతిలో ఆనందరాగరంజితం చెయ్యాలని మనసార ప్రార్ధిస్తున్నాను.

కౌముదికి ఇది వందో సంచిక పండగ మాత్రమే. ఇంకెన్నో వందల పండగలు చూడాలి. చిరంజీవ..!!

**భువనచంద్ర**

*చిరంజీవి కౌముదీ.....శతమానంభవతి*



'ఎవరిశైలి వారికి అన్నట్టు, ప్రతి పత్రికకీ తనదనే 'సంస్కారం ' ఉంటుంది. అలా సంస్కారం ఉట్టిపడే పత్రిక 'కౌముది'. ప్రతి పేజీ వెన్నెల కిరణాల్లాగా మనసుని ఆహ్లాదపరిచేదే. ప్రతి రచనా తనదనే ముద్రతొ పాఠకుడిని అలరింపచేసేదే. అన్నిటినీ మించి 'ముఖచిత్ర కవిత ' సౌందర్యం గురించి చెప్పకతప్పదు. అవి అక్షరాల కూర్పుగా నాకెన్నడూ అనిపించలేదు. అత్యంత సంస్కారవంతమైన హృదయంలో పుట్టిన వెన్నెల కెరటాల్లా నాకు కనిపిస్తాయి. 'నూరు 'కి ఒక విశిష్టత ఉంది. శతదినోత్సవం, శత వర్షత్సవంలాగా ఒక పత్రిక శత మాసాలు నిర్విఘ్నంగా నడిచిందంటే, ఆ పత్రిక 'సారధి', యొక్క సంకల్పం ఎంత గట్టిదో అర్ధమవుతుంది. 'కౌముది' నిజంగా తరతరాల వారధి. ఎందరెందరో మహారచయితల నుండి నేటి ఔత్సాహిక రచయిత (త్రి)లదాకా ఒక మహావారధిగా నిలిచింది. కిరణ్‌ప్రభ గారి అకుంఠిత దీక్షాదక్షతలే ఈ శతమాస విజయానికి కారణం. ఎన్ని వేలమైళ్ళ ప్రయాణమైనా మొదలయ్యేది మొదటి అడుగుతోటే. కౌముది మొదటి అడుగువేస్తూనే తనతో పాటు ఎందరెందరో రచయితల్నీ, రచయిత్రుల్నీ, కవుల్నీ విశిష్టవ్యక్తుల్నీ సహచరులుగా చేసుకుంటూ ఒక మహాయాత్ర ప్రారంభించింది. అవిఘ్నమస్తు అడుగులు వేస్తూ 99 రూపులు మార్చుకుని నూరవ అంకంలో అడుగుపెడుతోంది.

'కౌముది' అనే నెచ్చెలి నాకు పరిచయం కాకపోతే నా 'మనసుపొరల్లో' అసలు వెలుగుచూచేదే కాదేమో! అలానే ఎందరెందరో అందించిన, అందిస్తున్న అమృతఫలాల్ని జీవితాంతం పోగొట్టుకునే వాడ్నేమో!

అమెరికాలో ఉంటూ, అహర్నిశలు 'తెలుగు ' భాష ఉన్నతి కోసం పాటుపడుతూ ఏ ప్రతిఫలాన్నీ ఆశించకుండా 'కౌముది'ని మనకు అందిస్తున్న శ్రీ & శ్రీమతి కిరణ్‌ప్రభగారిని ఎంత శ్లాఘించినా అది తక్కువే అవుతుంది. ఈ పత్రిక కోసం వెచ్చించే సమయాన్ని మరో 'సంపాదన' కోసం వెచ్చిస్తే, ఎన్ని కోట్లు సంపాదించేవారో కానీ, వెన్నెలవంటి చల్లని మనసున్న ఆ దంపతులు సంపాదన మీద ఎందుకు దృష్టి మళ్ళిస్తారూ!? కౌముదినే తమ పుత్రికలా భావించి సంపూర్ణ ప్రేమతో పెంచుతున్నారు. ఆ బిడ్డ దినదిన ప్రవర్ధమానమై పాఠకలోకాన్ని పరవశింపజేస్తోంది. ప్రతి రచనా ఓ ఆణిముత్యమే. సముద్రంలో రాళ్ళన్నీ ఒకచోటా, రత్నాలన్నీ ఓ చోటా చేరతాయనే సామెతలాగా, ఈ సంస్కారవంతమైన పత్రికలో ప్రతిరచనా ప్రతిశీర్షికా కూడా తన ప్రత్యేకతని స్పష్టంగా చాటుకుంటోంది.

ఇంతటి మహత్కార్యాన్ని అవలీలగా సాధిస్తూన్న శ్రీ&శ్రీమతి కిరణ్‌ప్రభగార్లని మనఃస్ఫూర్తిగా అభినందిస్తూ, ఈ చక్కని పత్రికకూ తమ రచనల్ని పంపి నిత్యపరిపుష్టం చేస్తున్న రచయితలకూ, రచయిత్రులకూ కవులకూ మనఃస్ఫూర్తిగా ప్రణమిల్లుతూ, ఈ 'కౌముది ' పాఠక హృదయాకాశంలో చిరంజీవిగా వర్ధిల్లాలనీ, దినదిన ప్రవర్ధమానం కావాలనీ హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తూ –

శతమానంభవతి. శతాయుఃపురుషస్యతేంద్రియ.ఆయుష్యేతేంద్రియేప్రతితిష్ఠతిః !

❀❀❀❀

**రామజోగయ్య శాస్త్రి**



ప్రస్తుతం మనమున్న సంధికాలంలో.. సంప్రదాయానికి, సంస్కారానికి విలువలకు పెద్ద పీట వేస్తూ ఒక సంచికను నడపడం చాలా ప్రయాసతో కూడినపని. ఆ ప్రయాసను సునాయాసంగా నిర్వహిస్తున్న శ్రీ కిరణ్‌ప్రభగారికి మనమంతా జేజేలు పలకవలసిందే. ముఖచిత్రంలో మొదలుపెట్టి ప్రతి శీర్షిక వైవిధ్యంగా ఉండేట్టు తీసుకునే జాగ్రత్త వారి అభిరుచికి అద్దం పడుతుంది. కిరణ్‌ప్రభగారితో వ్యక్తిగతమైన పరిచయాన్ని పురస్కరించుకుని 'కౌముది' ఎదుగుదలకు తలో చెయ్యివేస్తున్న మహానుభావులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసుకోవాలి. సమాజానికి మంచి చేయాలి. తమదైన శైలిలో – అన్న ఆలోచన ఎంతమందిలో ఉన్నా – దాన్ని ఆచరణలో అమలు చెయ్యగల సంకల్పబలం కొందరికే ఉంటుంది. ఆ లక్షణం పుష్కలంగా ఉన్న శ్రీ కిరణ్‌ప్రభగారి కృషి సర్వదా అభినందనీయం.

కౌముది ప్రస్థానం నిరాఘాటంగా ఇకపైనా కొనసాగుతుందన్న సంపూర్ణమైన విశ్వాసం నాకుంది. శ్రీ కిరణ్‌ప్రభగారికి, శ్రీమతి కాంతిగారికి మరొక్కసారి అభినందనలు కృతజ్ఞతలతో –

❀❀❀❀

**మోహన్ నన్నపనేని**




నిండు నూరు సంచికలు విజయంతంగా నిర్విరామంగా చదువముచ్చటగా పూర్తిచేసుకోవటమే కాకుండా దినదిన ప్రవర్ధమానం చెందుతూ వేలాది పాఠకులను స్వచ్ఛందంగా ఆకుట్టుకుంటున్న "కౌముది" సాహితీ పత్రికకూ దీని వెనుక రచనా రధసారధి కిరణ్ ప్రభ గారికి హృదయపూర్వక అభివందనలు. అమెరికాలో జీవనవిధానం ఉద్యోగ, కుటుంబ, సామాజిక, వ్యక్తిగత వత్తిడుల మధ్య నిత్యం నలుగుతూనే ఉంటుంది. మరోపక్క వ్యాపార రహితంగా ఒక పత్రికను

ప్రచురించటం కూడా ఖర్చుతో కూడిన వ్యహారం. ఇటువంటి పలు సమస్యలున్నప్పటికీ కేవలం తెలుగు భాష, సాహిత్యం పట్ల కిరణ్ ప్రభ గారికి ఉన్న అభిమానానికి నిలువెత్తు నిదర్శనమే కౌముది నూరు సంచికల జైత్రయాత్ర... ప్రతి సంచికలోనూ కౌముది ముఖచిత్రం ఓ మధురానుభూతిని నింపేలానో, మనసు తొలిచేలానో, దోచేలానో, లోలోన నిలచేలానో ఒక చక్కని కవితతోనూ దానికేమాత్రం తీసిపోని ఒక మంచి చిత్రంతోనూ రూపొందించటం మరే సమకాలీన సాహితీ పత్రికలకు లేని ప్రత్యేకత. కిరణ్ ప్రభ గారి రచనల్లోనూ, సంకలనాల్లోనూ, సంపాదకీయాల్లోనూ ప్రకృతి, మానవత, మానవ సంబంధాలను ప్రతిబింబించేలా ఉంటాయి. తద్వారా కౌముది ఒక ప్రత్యేకమైన పాఠక లోకానికి చేరువయ్యింది. కౌముదిని ఉరువళ్ళు తొక్కే కొండవాగులా కాకుండా అడవి అందాలను చుట్టుకుని సుందరంగా సాగుతున్న నిండు వెన్నెల్లో గోదావరిలా నడిపించటం అసామాన్యం అద్భుతం!! తన మానస పత్రిక కౌముది జైత్ర యాత్రను నూరు సంచికల తొలిమజిలీ దాటుకుంటూ ఒక మహా యజ్ఞంలా నిర్విరామంగా సాగించటమే కాకుండా అందులోని సాహితీ విలువలతో ఏమాత్రం రాజీ పడకుండా నిర్వహిస్తున్న నా ఆత్మీయ మిత్రుడు కిరణ్ ప్రభ గారిని మరొక్క సారి మనసారా అభినందిస్తూ..

❀❀❀❀

**నారాయణస్వామి శంకగిరి**



అమెరికాలో కేలిఫోర్నియాలో ఇద్దరు పుణ్య దంపతులు. ఆయనేమో ప్రభాకరుడు. ఆవిడేమో కాంతి. పేర్లలోనే కాదు, వ్యక్తిత్వాలలోనూ, అభిరుచుల్లో కూడా వాళ్ళిదరిదీ ఒకటే మాట, ఒకే మనసు. ఇహ వాళ్ళకి పుట్టిన పాపాయి కాంతివంతంగా ఉండటంలో ఆశ్చర్యమేముంది? ఐతే, ఆ కాంతి చురచురా కాల్చివేసే గ్రీష్మ మార్తాండ తాపం కాదు, అల్లనల్లన సేదదీర్చి రసభరితం చేసే వెన్నెల. కౌముది. సాహిత్య కౌముది.

మన పురాణాల్లో సద్యోగర్భం అని ఒక ప్రక్రియ చెప్పారు. దీనివల్ల జనన ప్రక్రియ అంతా ఇన్స్టంటేనియస్ గా జరిగిపోవడమే గాక పుట్టే బిడ్డడు పూర్తిగా ఎదిగిపోయి సంపూర్ణంగా ఉంటాడు – సత్యవతీ దేవికి వ్యాసభగవానుడు పుట్టినట్టు.

అలాగే ఈ సాహిత్య కౌముదికి కూడా బాల్యపు చేష్టలూ బాలారిష్టాలూ ఏమీ లేవు. పుట్టడమే శరత్పూర్ణిమ చంద్రుడి కాంతితో పుట్టింది. అలాగే వెలుగొందుతోంది. అంతర్జాలంలో మంచి తెలుగు చదవాలని తపించే తెలుగు పాఠకులని రసప్లావితం చేస్తోంది. చంద్రమా మనసో జాతః అని వేద వాక్యం. చంద్రుడికీ, చంద్రుడి శక్తియైన వెన్నెలకీ మన మనసుల మీద చాలా పట్టుంది. ఈ అంతర్జాల కౌముది అందుకి భిన్నం కాదు. పాఠకుల మనసుల్ని ఆవరించి ఉన్నది కదా! నెలనెలా క్రమం తప్పకుండా ఒకటో తారీకుకల్లా వెలువడుతున్నా .. హబ్బా, పున్నమి నెలకొక్కసారే రావాలా అని పాఠకు నిట్టూర్చక మానరు గదా!

ఈ తొమ్మిదేళ్ళ పుట్టినరోజు పాపాయికీ, జన్మనిచ్చిన ఆ ప్రభాకర కాంతిమతులైన తలిదండ్రులకీ .. మనసారా మేలు తలపులు.

చల్లగా ఉండండి.

అక్షరాల్ని పండించండి.

❀❀❀❀

## ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ



కౌముది అంటే వెన్నెల అని అర్థం.

బే ఏరియాలో మంచి తెలుగు సాహిత్యమంటే మొహం వాచిపోయినవారికి, ఏకాంతపు చీకట్ల నీడల్లో మగ్గిపోయిన వారికి , నిలువునా అక్షరాల రూపంలో కురిసి తడిపేసే వెన్నెల " కౌముది".

సిరికోన (సిలికాన్) లో తెలుగు వెలుగుల భావాకాశం నుంచి దుమికే సృజనాత్మక జలపాతం "కౌముది".

సిరికోనలో విరబూసిన సిరివెన్నెల "కౌముది".

జలపాతం ఒకచోట దూకినా అది అక్కడే ఆగదు. అందుకొనే ఎదపల్లం ఉంటే చాలు, అది అనంత సీమలకు ప్రవహిస్తుంది. సిరివెన్నెలకూడా అంతే ! జగతి అంతా ప్రసరిస్తుంది.

ఈ " కౌముది" కూడా అంతే. సిరికోనలో సంపుటీకరణం (కంపుటీకరణ) పొందినా, తెలుగుపలుకున్న నేల నాలుగు చెరగులా తన చల్లని వెలుగును ప్రసరిస్తూనే ఉంది.

సూర్య కాంతి క్రమక్రమంగా వేడెక్కుతుందని, ఓ చక్కటి జంట పరమ అంకితభావంతో , ఆ కిరణప్రభను చల్లబరచి , చంద్రికగా మార్చి తెలుగు జగతికంతా పంచుతున్నది.

తెలుగు తల్లికి సాహిత్య కౌముది ఉత్సవాన్ని క్రమం తప్పక నెలనెలా జరిపిస్తున్నది.

నిత్యోత్సవ సేవ సలిపే ఆ నిస్వార్థ సత్సాహితీ వసంత మూర్తులకు ఏమిచ్చి తెలుగుసోదరులు తమ కృతజ్ఞత తెలుపుకోగలరు?

వంద సంచికలు కాదు, వంద వసంతాలు అలానే నిత్య కౌముదీ ఉత్సవాన్ని నిర్వహించమని, ప్రచ్ఛన్న స్వార్థంతో శుభాకాంక్షలు పలకడం తప్ప!

పరమేశ్వరుడు కిరణ్ ప్రభా దంపతులకు వందేళ్ళ సకల సౌభాగ్యాలనిచ్చి ఈ సాహిత్య కౌముది ఉత్సవాన్ని నిరంతరాయంగా, సుసంపన్నంగా జరిపింప చేయాలని ప్రార్థిస్తున్నాను.

★★ ★★

ఇంత అభిమానంగా ఈ మాటలు రాయడానికి కారణం-- కౌముది కాంతిలిపి పత్రిక నిర్వహణ తీరే!

అందులో ముఖ్యంగా ఆ ఆడియో సంచికలు! నవ్యతకు నవ్యత! అర్థవంతానికి అర్తవత్తత!

గత ఏడాది కాలిఫోర్నియాకు వచ్చేదాకా కౌముది గురించి నాకు తెలియదు. మా ప్రేమైకమూర్తి డా . నందమూరి లక్ష్మీపార్వతి గారివల్లే కిరణ్ ప్రభగారి పరిచయం. ఆ పిమ్మట కౌముది పరిచయం. ఆ తర్వాత క్రమం తప్పకుండా కౌముది పాఠకుణ్ణయ్యాను.

రాయటం నేర్చుకొనే ప్రతివాడూ, తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని అలవరచుకోవాలి, పెంపొందించుకోవాలి. జాగ్రత్తగా ఇతరుల రచనల్ని పరిశీలించి, నేర్చుకోవాలి, అభివృద్ధిపరచుకోవాలి.

తెలుగులో నేనలా అభిమానించి, ఒరవడిగా పెట్టుకొని చూసే కొన్ని శైలులున్నాయి. అందులో ఒకటి గొల్లపూడి మారుతీరావుగారిది. అది చాలా అసాధారణమైంది. అనితర సాధ్యమైంది. అ పదును, విరుపు ఆయనకే స్వంతం. అయన చిన్న కాలమ్ రాయని, దాన్నొక పాఠంగా చూస్తాను. ఆయన గొంతుతో వింటున్నట్లుగా ఊహించుకొంటూ చదువుకొనేవాణ్ణి.

అలాటప్పుడు, కౌముది కాంతిపత్రికలో నేరుగా అయన గొంతుతోనే వినే సౌలభ్యం చూసేసరికి ఎంత ఆనందంగా ఉంటుంది. వెనకటికి లండన్ లోని శ్రీ గూటాల కృష్ణమూర్తిగారు శ్రీశ్రీ కవితలను అయన గొంతుతో కావ్యపాఠం చేయించినప్పుడో, శాంతినికేతన్ కు వెళ్ళినప్పుడు రవీంద్ర ఆడియోకేసెట్ దొరికినప్పుడో, అంతెందుకు కృష్ణశాస్త్రి సాహితి స్వర్ణోత్సవాల సందర్భంగా,

ఆకాశవాణి సౌజన్యంతో అయన పల్లకీ పద్యాల పాత రికార్డింగును విన్నప్పుడు ఎంత ఆనందపడ్డానో , కౌముదిలో గొల్లపూడిగారి గొంతమ్మటే ఆయన విరుపుల్ని, చెణుకుల్నివిన్నప్పుడు అంతగానూ ఆనందపడ్డాను.

అలాగే, తన సహజ మేఘగంభీర స్వరంతో, కిరణ్ ప్రభ గారు , సినిమాతో ముడిపడ్డప్పటికీ ఉత్తమ సాహిత్యాకాశం లో అద్భుత ప్రభలు నింపిన ఎందరో తేజోమూర్తులను, హృద్యంగా, సమగ్రంగా పరిచయం చేస్తోంటే అపారమైన ఆనందం కలిగేది. ఉదాహరణకు భారతీయ సాహిత్యం లో అసదృశమూర్తి శరత్! అలాగే ఆధునిక తెలుగు సాహిత్యంలో ధ్రువతార దాశరథి! వారి గురించి విడిగా ఎంతో చదువుకొన్నాను. కానీ చదువు కోవడం వేరు, హృదయాన్ని సున్నితంగా హత్తుకొనే గొంతు వినడం వేరు. చెప్పేవారికి మంచి స్వరం, శబ్దసంస్కారం ఉంటే అలా వినడానికి ఏదీ సాటి రాదు. దానికదే ఓ ప్రత్యేకమైన అనుభూతి. కిరణ్ ప్రభ గారు తన ప్రసంగ వ్యాస సంచికలతో అంత చక్కటి అనుభూతి కలిగిస్తారు. ఆ అనుభూతి వెనుక ఎంతో పరిశ్రమ, పరిశోధన దాగి ఉంటాయి.

అసలు పత్రికంతా అలాగే "శ్రావ్యంగా" ఉంటే , కనీసం మరికొన్ని ముఖ్య శీర్షికలయినా అలా ధ్వనిముద్రణతో వస్తే ఎంత బావుణ్ణనిపిస్తుంది? ముఖ్యంగా చక్కటి కవితల్ని సుస్వరమున్నవారు చదివితేనే వినాలి! కవిత్వం ఏ మాధ్యమం--అంటే -- ఛందస్సులోకానీ, మాత్రాగతిలోకానీ, లేదా, వచనం లోనైనా కానీ ఎందులో రాసినా దాంట్లో ఒక అంతర్లయ నిబిడీకృతమై ఉంటుంది. అదలా ఉన్నప్పుడే కవిత్వం. లేదంటే శుద్ధ ఉత్తరాల వచనం. సుస్వరమున్నవారు ఆ అంతర్లయను ధ్వనింపచేస్తూ --రిథిమిక్ గా-- చదివినప్పుడు కవితలోని మ్యూజికాలిటీనే కాదు, తెలుగుభాషకే ప్రత్యేకమై, ప్రపంచభాషల్లో తెలుగుకు అనన్య స్థానాన్ని చేకూర్చే ఆ మ్యూజికాలిటీ సుస్పష్టంగా చెవులబడుతుంది. . తెలుగు మాధురీమహిమ అంతరంగాన్ని ఆక్రమిస్తుంది. .. అలానే చిన్నచిన్న కథలను, పిల్లలకు ఇష్టమైన చిన్న కథలను కూడా శ్రవ్యరూపం లో అందిస్తే ఎంతో బాగుంటుంది .

కౌముదిలో నన్ను విశేషంగా ఆకట్టుకొన్న మరో అంశం -- కొత్త రచనలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో, విలువైన పాత రచనలకు కూడా అంతే ప్రాధాన్యమిస్తున్నారు. పెద్ద రచనల్ని సీరియల్స్ రూపంలో అందిస్తున్నారు. వర్తమానాన్ని గతంతో ముడేసి పాతకొత్తల మేలికలయికగా తీర్చి దిద్దుతున్నారు. అందులో నన్ను విశేషించి ఆనందపరచింది మా లక్ష్మీపార్వతిగారి శ్రమణకం నవల. నిజంగానే అది తెలుగులో నిలిచే మంచి నవలల్లో ఒకటి. .... దాన్ని ఆమెగారి శ్రావ్యమైన గొంతుతో కలిపి అందిస్తే ఎంత బావుణ్ణు అనిపిస్తుంది. అలాగే ఇటీవల ప్రారంభమైన కె. గీత గారి వెనుతిరగని వెన్నెల నవల. ప్రారంభమే చాలా ఉత్కంఠభరితంగా మొదలయ్యింది. మారుతున్న సాంస్కృతికభూమికల్లో స్త్రీ వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తున్నట్లుంది. రచయిత్రి నేరుగా మన ఎదుటికి వచ్చి మాట్లాడుతున్నట్లుంది. ఇలాటిదాన్ని స్వరసహితంగా వింటే ఎంతో గమ్మత్తుగా ఉంటుంది. అమెరికాకు వచ్చేదాకా మంచి నవలలకు లిఖితప్రతులతో పాటు ధ్వనిప్రతులు కూడా మార్కెట్లో ఉంటాయని తెలియదు. మన తెలుగుకు ఎలానూ అంత మంచి మార్కెట్ రాదు. .. ఉన్నంతలో కౌముది లాటి పత్రిక ఆ కొరత తీరిస్తే, కొత్త పుంతతో పాటు చరిత్రలో మిగిలిపోతుందన్నది నిజం.

నిజానికి కౌముది ఇప్పటికే ఒక చరిత్రను సృష్టించుకొంది. దానికి నిదర్శనమే ఈ వందోసంచిక ఉత్సవం. ఎన్నో కొత్త దనాలతో, ఏ నెలా ఆలస్యం కాకుండా ఒకటో తారీఖుకే ఠంచనుగా వెలువడటం. అన్ని వనరులూ ఉన్న ఆంధ్రదేశంలోనే ( అమ్మయ్య! రాష్ట్రం విడిపోతే విడిపోయిందిగానీ, మళ్ళీ ఎన్నో దశాబ్దాల తర్వాత ధైర్యంగా ఆంధ్రదేశమనే మాటను వాడుకోగలుగుతున్నాం. క్రీడాభిరామాన్ని స్మరించుకొని మళ్ళీ ఓరుగల్లును ఆంధ్రనగరీ అని పిల్చుకొనే రోజు ఎన్నడొస్తుందో!) క్రమం తప్పకుండా సకాలంలో పత్రికను వెలువరించడం ఎంతో కష్టమైన రోజుల్లో, అంత దూరదేశంలో , ఇన్ని శీర్షికలతో , ఇంత సమయపాలనతో ఎలా తీసుకువస్తున్నారా అని చాలా విస్మయం కలుగుతుంది. దానికోసం ఆ దంపతులను ఎంత అభినందించినా తక్కువే!

శీర్షికలంటే జ్ఞాపకం వస్తుంది. ఏ పత్రికనైనా " సకుటుంబ పత్రిక" అనేయడం పెద్ద అలవాటు. అమ్మకంకోసం దాదాపు ప్రతి పత్రిక ఆ పేరెట్టుకొని బ్రతికేస్తున్నాయ్. అయితే అందులో నిజంగా సకుటుంబ పత్రిక లెన్ని? ఓ చక్కటి సంసారపక్షమైన

రచనో, ఓ ప్రబోధాత్మకమైన రచనో చదివామని తృప్తిగా పేజి తిరగేయగానే, పక్క పుటలోనే ఓ బూతుబొమ్మో, సెక్సు కథో అగుపిస్తుంది. పేర్లెందుకు కానీ, ఈపాపం పెద్ద పత్రికలు మూటగట్టి పంచిందే. ..... అలాటి కలుషిత వాతావరణంలో అచ్చమైన కుటుంబ పత్రికగా, ఆహ్లాదం కంటె మించి మంచి సంస్కారాలను, అభిరుచులను పెంపొందించే పత్రికగా కౌముది వెలువడుతుండడం ప్రత్యేకంగా అభినందించవలసిన గొప్ప విషయం. దానివెనుక కవిగారని అందరిచేత ఆప్యాయంగా పిలువబడే ప్రభాకర రావు– వురఫ్– కిరణ్ ప్రభ గారి నిష్ఠ , ఆయనలోని ఉత్తమ రచయితకుండే దార్శనికత ఉంది. అంచేతే కౌముది అంత సమగ్రంగా వస్తోంది.

ఏ సంపాదకుడికి 'దార్శనికత' ఉంటుందో, ఆ పత్రికకు ఒక స్పష్టమైన 'దర్శనం' --అంటే--తాత్త్వికత ఉంటుంది. అది ఉన్నప్పుడే ఆ పత్రిక తన సామాజిక --సాంస్కృతిక బాధ్యతను అర్థవంతంగా నెరవేరుస్తుంది.

కౌముదిని అలాటి సాంస్కృతిక జవాబ్దారీ కలిగిన పత్రికగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది.


### సత్యం మందపాటి



కిరణ్ ప్రభగారు 'కౌముది' పత్రిక మొదలు పెట్టినప్పటి నించీ, నేను కౌముదికి రెండు శీర్షికలు, కొన్ని వ్యాసాలూ, కథలు వ్రాశాను. వ్రాస్తూనే వున్నాను. ఆయన ప్రచురిస్తూనే వున్నారు. నేను కౌముది పత్రికకి నా రచనలు పంపటానికి ముఖ్య కారణం, కౌముది పత్రిక మంచి సాహితీ విలువలు వున్న పత్రిక కనుక. ఎన్నో రకరకాల శీర్షికలు – మారుతీరావుగారు, సిరివెన్నెలగారు, భువనచంద్రగారు, సుభద్రగారు.. ఈ పేర్లు కొన్ని ఉదాహరణకు ఇచ్చినవి మాత్రమే. ఇంకా ఎందరో సాహితీ విద్వాంసులు నెల నెలా మనల్ని పలకరిస్తున్నారు. తమ రచనలతో అలరిస్తున్నారు. అందుకే నాకు కౌముది పత్రిక అంటే అంత ఇష్టం. కిరణ్ ప్రభగారు ఫోటో కవితలతో తన సాహితీ జీవనం, కొన్ని దశాబ్దాల క్రితం మొదలు పెట్టినట్టు ఆయనే ఒకసారి చెప్పినట్టు గుర్తు. ఇప్పుడు కూడా పత్రికకి ముఖచిత్రం గీయించి, దానికి తగ్గట్టుగా చక్కటి కవిత వ్రాసి ప్రచురించటం ఆయనకే చెల్లింది! నేను మొట్టమొదటగా చదివేది ఆయన ముఖచిత్ర కవిత అంటే ఆశ్చర్యం లేదు! ఇంకొక విషయం, నెలనెలా ఇన్ని (ఎన్నో) మంచి శీర్షికలు వున్న పత్రిక ఒక్క కౌముది మాత్రమేనేమో! దీని వెనుక కిరణ్ ప్రభ గారి పట్టుదల, కాంతి కిరణ్ గారి శ్రమ, ఓర్పు.. పత్రికలో ప్రతి పేజీలోనూ కనిపిస్తూనే వుంది. ఇప్పటికి వంద సంచికలు పూర్తి చేసుకున్న పండగ సమయంలో నా హృదయపూర్వక అభినందనలు. ఇంకా కొన్ని వందల సంచికలతో, కౌముది తెలుగు సాహితీ వనంలో చల్లని వెన్నెల కురిపించాలని మనసారా ఆశిస్తున్నాను

### సుధామ

*కౌముదిలో నూలుపోగు*



'కౌముది ' ఆ పేరే ఎంతో బాగుంటుంది. వెన్నెలకు ఉన్న పేర్లలో 'జ్యోత్స్న' ఎలానో, కౌముది అంత మహోత్సవంగాను ఉంటుంది. వెన్నెలకు కిరణ్ప్రభలు, కాంతికిరణాలు సహజాతి సహజాలే కదా! వెన్నెలను ఇష్టపడని వారుంటారనుకోను. నన్ను చాలామంది 'సుధామ' అని కలం పేరు ఎందుకు పెట్టుకున్నావని అడుగుతుంటారు. ఎందుకో తెలీదు గానీ సుధ అంటే అమృతమయుడు సుధామ అంటే అమృతమయమైన, అమృతమయుడైన అనే అర్థంలో వెన్నెల, చంద్రుడు అనే అర్థాలు కూడా ఉన్నాయి. చంద్రుడే కదా వెన్నెలలు

వెదజల్లేది. సు అంటే మంచి వ్యవస్థ ఏర్పడాలన్న సంకల్పమూ ఆ భావనలో గర్భితమే మరి!

2008 ఆగస్టులో ఆకాశవాణి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాను. పెన్షన్ అవీ సెటిలయేసరికి ఏడాదిపట్టింది. 2009 నవంబర్ చివర్లోనో, డిసెంబర్‌లోనో అమెరికా నుంచి నాకు ఫోనొచ్చింది. అది చేసింది ఎవరో కాదు. కిరణ్‌ప్రభగారే! 1960 – 70 దశకంలో 'మానవత' అనే సైక్లొస్టయిల్డ్ మాసపత్రిక హైదరాబాద్ నుంచి వెలువడటం, దానికి నేను ముఖచిత్రాలూ అవీ సంతరించడం, తానూ అందులో సారధ్యం వహించడం వంటి ఆ మధురస్మృతులను గుర్తుచేస్తూ 'కౌముది' అంతర్జాల పత్రికను నిర్వహిస్తున్నాననీ దానికి నన్ను ఏదయినా రాయమనీ అడిగారాయన. అప్పుడప్పుడే ఇంటర్నెట్‌తో పరిచయం చేసుకుంటున్నాను.

అంతర్జాల పత్రికగా 'కౌముది'ని తెరవగానే నాకు ఆశ్చర్యానందాలు కలిగాయి. వేరు ఒకటి రెండు పత్రికలు అంతర్జాల సంబంధులే అప్పుడు చూశానుగానీ అవేవో నోట్‌బుక్ పేజీలు చూసినట్లే అనిపించింది గానీ, కౌముది మాసపత్రిక పేజీలు నన్ను ఆకట్టుకున్నాయి. ఒక పత్రిక అనే ఆకర్షణ దాని నుంచి నాకు కలిగింది.

కిరణ్‌ప్రభగారు అడగడంతో నా వృత్తిపరమైన జ్ఞాపకాలే ఎందుకు రాయకూడదు అనిపించింది. వృతిపరంగా ఎందరో సాహితీ కళారంగాల వ్యక్తులతో, అంశాలతో కలిగిన పరిచయాలు రాస్తే బానే ఉంటుందనిపించింది. కిరణ్‌ప్రభగారు కూడా 'రైతో ' అనగానే 'రేడియోజ్ఞాపకాలు' అని ఆయన అనడంతో జనవరి 2010 సంచికనుంచి నా 'రేడియోజ్ఞాపకాలు' కాలమ్ గా 'కౌముది'లో మొదలయ్యింది. ఏ నెలకు ఆ నెల రాయడమే అయ్యింది. ఒక్కసారి సంచిక మొదటి తేదీనే ఠంచనుగా వెలువడుతుందనీ తెలిసీ నాలుగైదురోజుల ముందు పంపి, ఇబ్బంది పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ ఏ మాత్రం విసుక్కోక వెంటనే రేడియోజ్ఞాపకాలు నేను రాసినది ఫైల్‌గా కూడా ముందే పంపి దానిలో సవరణలు, అచ్చుతప్పులు ఏవయినా ఉంటే సరిచేయమని కోరి, నేను అలా పంపగానే ఎంతో శ్రద్ధగా, అందంగా 'కాలమ్'ని తీర్చిదిదుతూ వచ్చారు. ముఖ్యంగా ఈ విషయంలో శ్రీమతి కాంతిగారికి నా కృతజ్ఞతాభివందనాలు ఎంత చెప్పినా తక్కువే. నా రేడియోజ్ఞాపకాలు గురించి నా మెయిల్‌కు ఎందరో అభినందనలు పంపేవారు. సూచనలు ఇచ్చేవారు. కౌముదిలో పాఠకుల అభిప్రాయాల దగ్గర స్పందన కూడా చూస్తూండేవాడిని. అక్కడ ఎక్కువ ప్రతిస్పందనలు లేవే అనుకునేవాడిని. అనేక రచనల్లో కాలమ్స్ లో ఒకటైనప్పుడు సంచికలో అభిప్రాయాలు వ్యక్తపరిచేవారు నా 'కాలం' గురించి అక్కడే పట్టించుకోవాలనుకోవడం సరికాదేమోలే అనుకునేవాడిని. కానీ నా ఈ మెయిల్‌కు, ఫేస్‌బుక్‌లో 'కౌముది'కి నేను 'లింక్' ఇచ్చినప్పుడు అక్కడ స్పందనలు ఆనందాన్ని కలిగించేవి. ఆంధ్ర బాలానంద సంఘం కామేశ్వరి (పాప) క్రమం తప్పకుండా నెలనెలా చదివానని చెప్పినప్పుడు బోలెడు సంతోషించాను. మా ఆకాశవాణికి డైరెక్టర్ జనరల్ హోదాలో రిటైరయిన ఆర్.ఎ.పద్మనాభరావుగారు అలాగే అసిస్టెంట్ డైరెక్టర్‌గా రిటైరైన చలపతిరావుగారు కూడా కౌముదిలో నా 'కాలమ్' చదివి మెచ్చుతూండడం జరిగేది. పాఠకులకు ఆసక్తిదాయకంగా మలచడంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలనీ, కథనాలు చెప్పాలనీ అనుకునేవాడినిగానీ ఏ నెలకానెల చివర్లో హడావిడిగా కూర్చుని రాయడమే జరిగేది.

ఏమయితేనేం అలా 57 నెలలపాటు కౌముదిలో 'రేడియోజ్ఞాపకాలు' కాలమ్ గా సాగి, సెప్టెంబరు 2014లో ముగిసింది. అలా 'కౌముది'కి కాలమిస్టుగా ఉన్నవాళ్ళల్లో చేరాను. గొల్లపూడిమారుతీరావు, సుద్దాల అశోక్‌తేజ, అదేపల్లి రామమోహనరావ్ ప్రభృతులే కాక మల్లాది వంటి ప్రముఖులు అలాగే మంచి సీరియల్స్, కథలు, కవితలు, కార్టూన్లతో కౌముది సాహిత్యపత్రికగానే కాక కుటుంబసమేతంగా అలరించగల అంతర్జాల పత్రికగా రాణిస్తోందనక తప్పదు. మరీ ముఖ్యంగా ఆడియో రచనలు సుతరించడం ఓ విశేషమైతే నెలనెలా ముఖచిత్రకవితలు మరెక్కడా కానరాని ఒక విలక్షణతే! 'రచన' మాసపత్రికలో కిరణ్‌ప్రభగారి ఆ అనుభూతి శకలాలు కరుణాకర్ గీతలతో ఇప్పటికీ చూస్తున్నాను.

వంద సంచికలు అంటే సామాన్యమైన విషయమేమీ కాదు. ఎనిమిది సంవత్సరాలు పూర్తిచేసుకుని తొమ్మిదవ సంవత్సరంలో నవనవోన్మేషంగా నడుస్తూ 'శత చంద్రదర్శనం' చేసిన 'కౌముది' పత్రిక 'సహస్ర చంద్ర దర్శనం' చేసుకునేంతవరకు కూడా

నిరాటంకంగా నిరాఘాటంగా కొనసాగాలని అభిలషిస్తున్నాను. రచయితలకు పారితోషికాలు కూడా చెల్లించగలిగేంత ఆర్థికాభివృద్ధిని కూడా సాధించాలని కోరుకుంటున్నాను. కౌముదీ దంపతులు కిరణ్‌ప్రభ, కాంతికిరణ్‌గార్లకు శుభాభినందనలు.

**డి.పద్మజ(తమస్విని)**



సాధారణంగా మనందరికీ కొన్ని ఇష్టాలు, అభిరుచులు ఉంటాయి. ముఖ్యంగా యవ్వనంలో మనం కొన్నిటి మీద ప్రగాఢమైన అభిమానాన్ని పెంచుకుంటాం. కానీ జీవితంలో స్థితపడే క్రమంలో వృత్తి, ఉద్యోగం, సంసార తాపత్రయాల్లో మునిగి పోయి వాటన్నిటినీ మర్చిపోయాం. అప్పుడప్పుడూ దూరం నుంచి వినిపించే ఓ పాట, ఏదో వెదుకుతూంటే, అలమరలో ఓ మూల కనిపించే పుస్తకం, 'అరె! ఒకప్పుడు ఇది నాకు ఇంత ఇష్టమో! మర్చిపోయానేంటి? అని ఫీలయ్యేలా చేస్తాయి.

కిరణ్‌ప్రభగార్లు (ఇక్కడ కిరణ్‌ప్రభ గారంటే ఒక్కరు కాదు బహువచనం. కాంతిగారు+ప్రభాకర్‌గారు) ఈ విషయంలో అదృష్టవంతులు. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నా అభిరుచి లేక ఇష్టాన్ని మర్చిపోకుండా మానసపుత్రికగా కౌముదిని రూపొందించి తనకి అత్యంత ఇష్టమైన సాహితీ సేవని చేస్తున్నారు. అలాంటి ఆసక్తి గలవారికి ఆ వెన్నెలని పంచుతున్నారు. వంద సంచికల కౌమారంలోకి అడుగుపెట్టిన కౌముది వేయి సంచికల మైలురాయిని కూడా దాటి ఇంకా, ఇంకా ఇంకా తన కాంతులని ప్రసరిస్తూనే ఉండాలని కోరుకుంటున్నాను.

మీ దంపతుల ఉత్తమాభిరుచికి వందనాలు.

**హేమ వల్లూరి**



నా ప్రియ స్నేహితురాలు ఆత్మీయురాలు కాంతిగారికి, నా అభిమాన కవిగారు...కిరణ్ ప్రభగారికి , అనేకానేక అభినందనలు. ఈ ఆనందోత్సాహవేళ నేనూ మీతో ఈ సందర్భాన్ని పండగలా భావిస్తున్నాను. ఎందుకంటే, కౌముదిలో మొదటగా ప్రచురితమైన సీరియల్ నాదే కావటం నాకు గర్వంగా వుంది. ఇందుకు కారణం మాత్రం, నా నిజ స్నేహిత..మా కాంతీ జీ నే. నిజం. నేను రాయటం మానేసిన వేళ, నన్ను తన ఆప్యాయతలో బంధించి...వెంట పడి," ఇహ నేను రాయలేను", అంటే వినక...వదలక, నాచే" ప్రేమలేని చోటు" అనే సీరియల్ రాయించిన ఘనత తనకే దక్కుతుంది. ఆ సీరియల్ ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే కదా! నా కెందరెందరో, ఆణిముత్యాల వంటి అభిమానులు లభించటానికి కారణం కూడా మా అపురూప దంపతులే కారణం. అందుకే, ఆ నా నవలను, మా కాంతి జీ కే అంకిత మిచ్చాను. అదే న్యాయం మరి. కాంతి జీ, కిరణ్ ప్రభ గారు, మీ ఇరువురిని, మరోమారు...మరోమారు గర్వంగా ముచ్చటగా మీకు అభినందల సుమాలు అందిస్తున్నాను. ఈ మీ(మన) సాహితీయాత్ర ఇహ ముందు కూడా ఇలాగే సాగాలని(సాగుతుంది) కోరుకుంటూ.. మరో మారు అభినందిస్తూ, శుభాకాంక్షలుతో...

❀❀❀❀

**అత్తలూరి విజయలక్ష్మి**

*తెలుగింటి పెరట్లో కౌముది*



కొబ్బరి మట్టల మీద చల్లగా, తెల్లగా పరచుకుని, పెరట్లోని నూతిగట్టుమీద పాకుతూ, మల్లె, జాజి, మందారలకు మంచి కథలు చెబుతూ, సీరియళ్ళ ఫలరసాలను తెలుగువారికి అందిస్తూ పట్టు పరికిణీ కట్టుకున్న కన్నెపిల్లలా పరుగులు తీస్తూ, పలకరిస్తూ, పలవరిస్తూ అందరి మనసులనూ ఆనందడోలికల్లో ఊగించే అంతర్జాల పత్రిక కౌముది.

100 సంచికలు పూర్తిచేసుకుందిట.. అబ్బురంగా లేదూ. అప్పుడేనా, నిన్న మొన్నటివరకూ ఎవరీ కౌముది? పుట్టిన వెంటనే పాకేసింది, ఆరునెలలు కాకుండానే అడుగులు వేయడం, పరుగులు తీస్తూ పందెంలో అన్నిటినీ, అందరినీ ఓడించి విజయగర్వంతో 100 సంచికలు పూర్తిచేసుకోడం అద్భుతం.

ప్రముఖుల దగ్గర్నించీ సాహితీ ప్రపంచంలోకి బుడిబుడి అడుగులు వేసే వారిదాకా అందరినీ ఆదరిస్తూ, ప్రోత్సహిస్తూ, నెలకొక అందమైన తెలుగింటి వెలుగుల్ని కవర్‌పేజీలుగా, ఆ కవర్ పేజీలకు అందమైన కవితల్ని వ్యాఖ్యలుగా మలచి మనకందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఆత్మీయులైన దంపతులు కాంతికిరణ్‌ప్రభలు. అన్యోన్యతకే కాదు అందరికీ ఆదర్శం వీరి దాంపత్యం.

కౌముది ఇంకా, ఇంకా తెలుగువారిని అలరిస్తూ అందరికీ వెన్నెల పంచుతూ ఆనందాన్ని అందించాలని కోరుకుంటున్నాను.

❀❀❀❀

**మంథా భానుమతి**



తెలుగు అంతర్జాల సాహితీ ప్రపంచం లో ఒక సంచలనం, ఒక ప్రభంజనం.

కౌముది ప్రారంభించిన కొద్ది నెలలకి నాకు నాకు సమాచారం వచ్చింది, ఒక మంచి అంతర్జాల పత్రిక ఆవిర్భవించిందని. అప్పుడప్పుడే అంతర్జాలం ఉపయోగం, వాడుక తెలిసింది. ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నాను. పత్రిక తెరవగానే ఆకర్షణీయమైన చిత్రం, కవిత ఆకర్షించాయి. తదుపరి శీర్షిక లన్నీ ఆసక్తి కరంగా కనిపించాయి..

వెంటనే ఒక నవల పంపించాను.. కొద్ది రోజుల్లోనే ప్రచురణకి తీసుకుంటున్నామని తెలియజేశారు. అప్పట్నుంచీ ప్రతీ నెలా నా రచన.. సీరియల్ గానో, కథగానో వస్తూనే ఉంది.

సంపాదకులు సుహృద్భావంతో పేరుపొందిన ప్రతీ రచయితనీ సంప్రదించి వారి రచనలు వేసుకోవడమే కాక, ఔత్సాహిక రచయితలకి ప్రోత్సాహమందిస్తూ పత్రికని తమ స్వంత బిడ్డలాగ పైకి తీసుకొస్తున్నారు.

పాఠకుల శీర్షికలు, పజిల్స్, కథల పోటీలు, కబుర్లు, యాత్రా విశేషాలు, ఆడియో ఇంటర్వ్యూలు.. పాఠకులకి ఎందులో అభిరుచి ఉంటే ఆ శీర్షిక మన కౌముదిలో ఉంటుంది.

ఇంత చక్కని పత్రిక నూరవ సంచికకి స్వాగతం.. ఎన్నెన్ని, ఏమేమి శీర్షికలుంటాయా అని ఎదురు చూస్తున్నాము.
కాంతికిరణ్ గారికీ, కిరణ్ ప్రభగారికీ అభినందనలు.

❀❀❀❀

విజయసారథి జీడిగుంట

కౌ'ముదావహం'



ఫేస్‌బుక్ ఇన్‌బాక్స్‌లో కిరణ్‌ప్రభగారి మెసేజ్ చూడగానే ఎప్పటిలాగే ఆయన్ని కలిసినప్పుడు మాట్లాడుతున్నప్పుడు గాని, ఇంటర్నెట్ టాక్ షోస్‌లో ఆయన మాటలు వింటున్నప్పుడు గాని నాకు వెంటనే స్ఫురించే చాలా ఇష్టమైన భర్తృహరి శ్లోకం మళ్ళా గుర్తొచ్చింది. నా చిన్నప్పుడు ఆకాశవాణి లో ప్రతి ఉదయం ప్రసారమయ్యే సంస్కృత పాఠం 'Signature Tune' అది ( https://www.youtube.com/watch?v=y0RknpclwxU) అది.

కేయురా న విభూషయంతి పురుషం, హారాన చంద్రోజ్వలః
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా న ముర్ధజః
వాన్యేకాసమలం కరోతి పురుషం, యా సంస్కృతా ధార్యతే
క్షీయంతే ఖలు భూషణాని సతతం, వాగ్భూషణం భూషణం

"చేతికి వేసుకున్న గండ పేరుండాల వల్లో, బంగారు కంకణాల వల్లో గాని , మెడలో ప్రకాశిస్తూ వేలాడుతున్న మణిహారాల వల్లో , గొలుసుల వల్లో గాని , ఒంటికి పూసుకున్న సుగంధ పరిమళ ద్రవ్యాల వల్లో, ధరించిన వస్త్రాల వల్లో గాని , తలపై పెట్టుకున్న కిరీటాల వల్లో గాని మానవులు అలంకరింపబడరు. వారి నోటి నుంచి వెలువడే సువాచకం వల్ల మాత్రమే మనుషులు అలంకరించ బడతారు. వాగ్భూషణం మాత్రమే వారిని దివ్య సుందరంగా అలంకరించే నగ "– అని దానర్థం.

ఈ భర్తృహరి శ్లోకం గురించి కౌముది వందవ సంచిక వెలువడుతున్న సందర్భంలో ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, 99 సంచికలు నిర్విఘ్నంగా లాభాపేక్ష లేకుండా కేవలం ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు వారందరికీ.. మంచి సాహిత్యాన్ని అందించాలనే ఒకే ఒక్క సంకల్పం మరియు తాపత్రయం తో 'కౌముది' అంతర్జాల మాస పత్రికని నిర్వహిస్తున్న కిరణ్‌ప్రభగారు, భర్తృహరి చెప్పినట్టు అతి సాధారణంగా కనబడినా అసాధారణమైన వాచకాన్ని ఆభరణంగా ధరించడమే కాకుండా తద్వారా మంచి సాహిత్య సంకలనం, సంపాదకీయంతో మా లాంటి సాహిత్య నిరుపేదలకి అందిస్తున్న తీరు బహు కౌ'ముదావహం'.

ఒక విధంగా కౌముది మాస పత్రిక అనే కన్నా 'కిరణ్‌ప్రభ' గారు, ఆయన శ్రీమతి కాంతి కిరణ్‌గార్ల మాస పుత్రిక అంటే సబబుగా ఉంటుంది. పుత్రిక జనానికి నవమాసాలు పడతాయి. కానీ ప్రతి మాసం ఈ కౌముది పుత్రిక జననానికి వాళ్ళు పడే ప్రసవ వేదన, ఆ పత్రికలో పొందు పరిచిన, పరుస్తున్న రచనలు, శీర్షికలు, సంపాదకీయాలు, సేకరణలు చూస్తే మనకి బాగా అర్ధమవుతుంది, ఆ కష్టం ఒక బిడ్డ కి జన్మనిచ్చే నొప్పికి యే మాత్రం తీసిపోదని. ప్రతి నెలా క్రమం తప్పకుండా క్రమ శిక్షణతో విడుదల చెయ్యడానికి వారు తమ దైనందిన జీవితంలో ఎన్ని త్యాగాలు చేస్తున్నారో తెలియదు కానీ, అన్ని బాధ్యతలు మాత్రం సక్రమంగా నెరవేస్తూ వుంటారని ఆయన్ని మిత్రునిగా పొందిన సాన్నిహిత్యంతో నమ్మకంగా చెప్పగలను.

ఆయన సంపాదకులుగా ఒక శతకం సంచికలు పూర్తి చేసుకోబోతున్న ఈ అంతర్జాల మాస కౌముది సాహితీ ప్రస్థానం గురించి నా విశ్లేషణ, స్పందన, సూచనలూ, అభిప్రాయాలూ వ్రాసి పంపమంటే నా గురించి రాసారేమిటబ్బా అని వాటిని ఆయన ఎడిటింగ్‌లో కట్ చేసినా నేను ఆశ్చర్యపోను. కాబట్టి ఇక కౌముది ప్రస్థానంలోకి వచ్చేస్తాను.

ఉపోద్ఘాతంలో చెప్పినట్టుగా ఆయన Facebook ద్వారా పంపిన మెసేజ్ లో ఒక్క టైపో కూడా లేదు, అలాగే ఆయన విన్నవించిన తీరు.. అచ్చతెలుగు లో స్వచ్ఛమైన విన్నపం. అది చదివిన వారెవరికైనా వెంటనే ఆ పనికి ఉపక్రమించాలనిపిస్తుంది. అందుకే ఈ సంచిక కోసం ఎంతో మంది ప్రముఖులు, సాహిత్య వేత్తలు, సాహితీ ప్రియులు ,పాఠకులు తమ తమ విశ్లేషణలు, స్పందనలు శుభాకాంక్షలు, శుభాశీస్సులు పంపుతారు కదా నేనెందుకులే అని అనుకోకుండా ఆ పనికి ఉపక్రమించాను. ఉపక్రమించాక తెలిసింది, ఇది అంత సులభమైన పని కాదని. గత ఎనిమిది సంవత్సరాలలో కౌముది ద్వారా నేను తెలుసుకున్న విషయాలు, చదివిన రచనలు, ఆనందించిన విషయాలు ఎన్నో ఉన్నాయి. సినిమాలు చూడటమన్నా ఆ రంగంలో ఉన్న ప్రముఖుల గురించి తెలుసుకోవాలన్నా ఎంతో ఉత్సాహం చూపించే నేను కౌముది సంచికలో ప్రతి నెలా ఒక దర్శకుడు తన మొదటి సినిమా ప్రస్థానం గురించి ప్రస్తావిస్తున్నారని నా మిత్రుడెవరో నాకు కౌముది మాగ్‌జైన్ లింక్ పంపితే జూన్ 2007లో అనుకుంటా కౌముది మాగ్‌జైన్ సబ్‌స్క్రైబ్ చేశా. తరువాత తెలిసింది ఆ చిన్నపని నాకు తెలుగు సాహిత్య జ్ఞానంతో పాటు కిరణ్‌ప్రభగారి సాన్నిహిత్యం కూడా సంపాదించి పెడుతుందని. ఒక విధంగా చెప్పాలంటే కౌముది మాస పత్రికని ప్రతీ నెలా అనుకున్న సమయానికి అంతర్జాల పాఠకులకు అందించడం కిరణ్‌ప్రభగారికి ఎలా ఒక వదులుకోలేని వ్యసనంగా మారిందో ఆ పత్రిక లో ఎన్నో శీర్షికల కోసం వేచి చూసి వాటిని క్రమ తప్పకుండా చదవటం నాకు కూడా ఒక వదులుకోలేని మంచి వ్యసనమయిపోయింది. అందుకు నేను ఆయనకీ, కౌముదికి సదా కృతజ్ఞుణ్ణి.

కథలు, కవితలు చదవడానికి అంతగా ఆసక్తి లేని నేను ప్రారంభ సంచికల్లో కిరణ్‌ప్రభగారి అద్భుతమైన సంపాదకీయంతో పాటు ఆయన వ్రాసే ముఖపత్ర కవిత, గొల్లపూడి మారుతీరావు గారి 'అవీ ఇవీ', 'మొదటి సినిమా' శీర్షికతో పాటు ప్రముఖ దర్శకుల సినీ ప్రస్థాన విశేషాలు, ఆ పాట మధురం శీర్షికతో వివిధ పాఠకుల జీవితాల్లో మరిచిపోలేని సినిమా పాటల ఘట్టాలు, పుస్తక పరిచయం మొదలైన అంశాలన్నింటినీ చాలా ఇష్టపడి చదివే వాణ్ణి. మరెన్నో కథలు కేవలం వాటి పేరు చూసి గానీ, అవి రాసిన వారి పేరు చూసి కానీ చదివే వాణ్ణి. కానీ ప్రతి పత్రిక నా లాప్‌టాప్‌లో సేవ్ చేసుకుని కొన్ని ఇంట్రెస్టింగ్ ఆర్టికల్స్ ప్రింట్ తీసుకుని మాత్రం ఉంచుకునేవాణ్ణి.

రానురాను కౌముదిలో ప్రచురించే వ్యాసాలు, శీర్షికలు చాలా ఆకర్షించడం మొదలు పెట్టాయి. ఉదాహరణకి, మనుచరిత్ర, నలోపాఖ్యానం, ఆముక్త మాల్యద , పోతన భాగవతం లాంటి తెలుగు కావ్యాల గురించి వినడం ఏదో కొద్దిగా తెలుసుకోవడమే తప్ప వాటిలో ఉన్న పద్యాల విశ్లేషణ సమగ్ర పరిశోధన తెలియని నాకు వ్యాస కౌముదిలో వాటి గురించి వివరిస్తూ ఎంతమంది ప్రముఖ సాహితీ వేత్తలు వ్రాసిన వ్యాసాలు చాలా ఆనందం కలిగించాయి.

అలా ప్రారంభమైన నా కౌముది పఠనంలో ఎన్నో మంచి మంచి రచనలు చదివించే వీలు కలిపించారు కిరణ్‌ప్రభగారు. ఆయన సంపాదకీయం రచనలు, యండమూరి, మల్లాది , కొమ్మూరి, యద్దనపూడి మొదలైన ప్రముఖ రచయతల నవలల పునర్ముద్రణలు, సూర్యదేవర రామ్మోహన రావు గారి నవలా పరిశోధనా విధానం, ప్రచురణలో లేని సిరివెన్నెల తరంగాలు, గతమెంతో ఘనకీర్తి శీర్షికన అద్భుతమైన పురాతన రచనా వ్యాసంగాలు, మన భారతం పేరుతో మన దేశ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాల విశ్లేషణ, శతకకారులు శీర్షికలో బహుళ ప్రాచుర్యం పొందిన మన తెలుగు శతకాల పద్యాల తీరుతెన్నులు, తెలుగు పలుకుబడి పేరుతో తెలుగు భాషా విపులీకరణ, చిత్రకదంబం ద్వారా అనేక ఆసక్తికరమైన సినిమా విశేషాలు, చిట్టెన్‌రాజుగారి 'అమెరి' కథలు, ఫ్లాష్‌బాక్ శీర్షికలో పలువురి ప్రముఖుల జీవిత విశేషాలు, వారితో పరిచయ వ్యాసాలూ , రాజాగారి ఆ పాతపాట మధురం, మాతృదేవోభవ, మా

మంచిమాష్టారు & టెన్త్ క్లాస్ శీర్షికలతో పాఠకుల ఆర్ద్రత నిండిన కథనాలు.. వసుంధరగారి భక్తి గిరి, రమణి బలభద్రపాత్రుని గారి కాలం దాటని కబుర్లు, సుధామగారి రేడియో జ్ఞాపకాలు, మధురవాణిగారి ఆర్టికల్స్, .. ఇలా చెప్పుకుంటూ పోతే కౌముదిలో ప్రచురించే ప్రతీ వ్యాసం, శీర్షిక, రచన, కథ, కవిత గురించి చెప్పాల్సి వస్తుంది. అందుకే కాబోలు ఆ విషయం ఆయనే ముందుగా గ్రహించి ఆ సాహిత్య సంపద ని కిరణ్‌ప్రభగారు కౌముది వెబ్‌సైట్‌లో గ్రంధాలయంగా పాఠకులకు అంద జేశారనుకుంటా. ఇక్కడ నాదొక చిన్న విన్నపం . కౌముది పత్రిక లో వ్యాస కౌముది లో ప్రచురించిన అనేక తెలుగు కావ్యాల విశ్లేషణలు కూడా ఒక పుస్తకం గా పొందుపరిచి గ్రంధాలయం ద్వారా అందచేస్తే చాలా బాగుంటుంది.

ఈ సాహితీ సంపద, జ్ఞాన సముపార్జన మా లాంటి దురాశపరులకి సరిపోదన్నట్టు గత కొన్ని సంవత్సరాలలో కౌముది ఆడియో మాగజైన్ – మరొక అద్భుతమైన ప్రక్రియ. ముందుగా చెప్పినట్టు ఆయన ఏవన్నా విషయాలు చెబుతుంటే అలా వినాలనిపిస్తుంది. అందుకే నేను ఆయన విరిజల్లు, రేడియో టాక్‌షోస్, కౌముది ఆడియో మాగ్‌జైన్స్‌ని ఎం.పి3 ఫార్మేట్‌లో మార్చుకుని నా లాంగ్ డ్రైవ్స్ లోను, అలాగే ఆఫీస్ కమ్యూట్‌లోనూ వింటూ ఉంటా. వ్యక్తుల గురించి అయితేనేమి, సినిమాల గురించి అయితేనేమి ఆయన విషయ సేకరణ నిజంగా అమోఘం. అలా ఎంతో మంది స్ఫూర్తి ప్రదాయకమైన వ్యక్తుల జీవితాల గురించి మనకి తను అలంకరించుకున్న వాగ్భూషణం తో మనల్ని అలరిస్తున్న కిరణ్‌ప్రభగారు, పేరులో సూర్య కిరణాలున్నా, కౌముది ద్వారా చల్లని జాబిల్లిని ప్రసరిస్తూ ఆ అంతర్జాల పత్రిక ద్వారా మరింత కీర్తిని ఆర్జించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శత సంచికోత్సవానికి నా హృదయపూర్వక అభినందనలు అందిస్తున్నాను.

ఎవరో మహానుభావుడు సెలవిచ్చినట్టు పుస్తకాలు అలంకరించడానికి రాయబడలేదు.. కానీ అలంకారానికి పుస్తకాన్ని మించిన వస్తువు లేదు. కౌముది గ్రంధాలయంలో ఉన్న ప్రతి పుస్తకం నిజంగా ముద్రించుకుని మన ఇంటిలో ఏ గదిలో పెట్టుకున్నా అది ఒక అచ్చమైన స్వచ్ఛమైన తెలుగు గ్రంధాలయం అవుతుందనడం అతిశయోక్తి కానే కాదు.

కిరణ్‌ప్రభగారు ఈ కౌముది పత్రికకి కేవలం సంపాదకుడు మాత్రమే కాదు. తద్వారా తెలుగు సాహిత్య ప్రియులకు అందజేస్తున్న అపర సంపదకి కారకుడు కూడా అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఆయన మనకి మరెన్నో సంవత్సరాలు ఆరోగ్యవంతమైన, ఆనందించతగిన తెలుగు వెలుగులు ప్రసరింప చేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**నాదెళ్ళ అనూరాధ**

*అరుగు దిగని వెన్నెల –పరిచయం అవసరంలేని వెన్నెల*



వెన్నెల తళుకుమంటూ ఉంటుంది.
వెన్నెల స్వచ్ఛంగా ఉంటుంది.
వెన్నెల మళ్లీ మళ్లీ వచ్చి పలకరిస్తూనే ఉంటుంది.
వెన్నెల దిగులు మబ్బుల్ని విసిరేస్తుంది
వెన్నెల గుండెనిండా ఆనంద తరంగాల్ని సృష్టిస్తుంది.
వెన్నెల తన సమక్షంలో సమస్తాన్నీ వెలిగిస్తుంది.

వెన్నెల ఒక కమ్మని పరిమళాన్ని మన చుట్టూ నింపుతుంది.

వెన్నెల పాపాయి నవ్వులా అలరిస్తుంది.

వెన్నెల మధురమైన అనుభూతుల్ని కలిగిస్తుంది.

వెన్నెల ఒక అందమైన అనుభవమైపోతుంది.

వాగూవంకల్నీ, కొండాకోనల్నీ అన్నింటినీ చైతన్యవంతం చేస్తుంది.

భూమ్యాకాశాల మధ్య నిశ్శబ్దంగా ప్రవహిస్తూ అద్వైతాన్ని బోధిస్తుంది.

మనిషిని భావుకుణ్ని చేస్తుంది.

వెన్నెల మీద ఎవరైనా ఒక వ్యాసమో, మరేదైనా రాయమని నన్ను అడిగారా అని మీ అనుమానం కదూ!

సరే, ఇక్కడ వెన్నెల చేసే గారడీ గురించి ఒక చిన్న కథ చెబుతాను.

ప్రీకేజీలో చేర్చిన మా పాపకి రోజూ నేనిచ్చే స్నాక్ బాక్స్ ని మళ్లీ పదిలంగా ఎలా ఇచ్చేనో అలాగే వెనక్కి తీసుకువస్తూ, పాప నా మనస్సుని గాయపరుస్తున్న రోజులవి! చాలా చాలా సంవత్సరాలక్రితం లెండి.....ఎప్పుడో క్రితం జన్మలో జరిగినట్టుంటుంది తలుచుకుంటే.

నేను పాపని మధ్యాహ్నం ఇంటికి తీసుకొచ్చేప్పుడు , అదే క్లాసులో ఉన్న తన మనవణ్ణి తీసుకెళ్లేందుకు ఒక ఉత్తరాది మహిళ వస్తూ ఉండేది. ఆమె పిల్లవాడు పూర్తిగా బయటకు రాకుండానే రోజూ ఖచ్చితంగా ఒక ప్రశ్న అడిగేది, 'డబ్బా ఖాయా?' అని. వాడు ఆనందంగా ఖాళీ డబ్బాని వాడి అమ్మమ్మకి చూపించేవాడు .

నా కూతురుమాత్రం డబ్బా మూత కూడా తియ్యకుండా నీరసించిన ముఖంతో బయటకొచ్చేది. నాకు ఉక్రోషంగా ఉండేది. కోప్పడదామంటే రెండున్నరసంవత్సరాల వయసైనా గట్టిగా లేని పసిపిల్ల. తినటం ఎలా అలవాటు చెయ్యాలో తోచేది కాదు.

రోజూ భోజనం కానీ, ఏదైనా తినిపించేదగ్గర నాకూ పాపకీ గొడవగా ఉండేది. నేను అలిగినట్టు గమనిస్తే కొంచెం తినే ప్రయత్నం చేసేది కానీ తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపించేది కాదు.

ఒకరోజుసాయంత్రం చీకటి పడ్డాక ఒంటరిగా బాల్కనీలో కూర్చున్న నాకు డ్రాయింగ్ రూమ్లోంచి మా పాప వాళ్ల నాన్నతో ఆడుతున్న ఆటలు , కేరింతలు వినిపిస్తున్నాయి . ఆ మధ్యాహ్నం అసలే భోజనం చెయ్యకుండా నిద్ర పోయిన పాపని గురించి ఆలోచిస్తూ ,' అన్ని విషయాలు చక్కగా అర్థం చేసుకుంటుంది, ఈ పిల్లకి తిండి పట్ల ఎలా ఇష్టం కలిగించాలి' అని దిగులు పడుతున్నాను .

చుట్టూ వెన్నెల. నేను వాళ్ల ఆటల్లో లేకపోవటం సడన్ గా గమనించిన పాప నా వెనుకనించి వచ్చి ' అమ్మా, వెన్నెల!' అంది సంతోషంగా.

తనకి తెలుసు, ఎప్పుడూ పౌర్ణమి రోజుల్లో బాల్కనీలో తనని కూర్చోబెట్టుకుని కూనిరాగాలు తీస్తూ వెన్నెల కథలు, కబుర్లు చెబుతూ హుషారుగా ఉండే నేను అలా నిశ్శబ్దంగా ఒంటిగా ఉండటం చూసి ఆశ్చర్యపోయింది. నా ముఖంలో దిగులు గమనించి ,తీర్చాలనుకుంది కాబోలు,

నా చెయ్యి పట్టుకుని ,సానుభూతిగా ' అమ్మా, వెన్నెల ఒలికిపోతోంది కదా' అంది చుట్టూ చూపిస్తూ.

అంత చిన్నపిల్ల మాటల్లో నాకు కవిత్వం తోచింది. అప్పటికి నా దిగులు మర్చిపోయాను.

వెన్నెల రోజుల్లో ఇప్పటికీ పాప మాటలు తలుచుకుంటూ ఉంటాను.

వెన్నెలకున్న శక్తి అలాటిది. పసివాళ్లని కూడా తన మాయలో పడేసుకుంటుంది.

ఈ వెన్నెల కథంతా ఇప్పుడెందుకంటే ...ఇప్పుడే మరి!

మన అందరికీ ఆత్మీయమైన నేస్తం కౌముది వెబ్ మాస పత్రిక . 'కౌముది' పేరులోనే వెన్నెల్ని ఇముడ్చుకున్న పత్రిక. రాబోయే కౌముది వందవ సంచిక గురించి చెప్పబోతే వెన్నెల నన్ను ఆవహించింది. అది పై పంక్తుల్లో కనిపిస్తోంది కదూ.

తెలుగు సాహిత్యాన్ని అందంగా, అపురూపంగా మన అందరికీ అందిస్తూ అప్పుడే కౌముది పత్రిక ఎనిమిది సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఎనిమిది సంవత్సరాలంటే ఒకరకంగా బాల్యావస్థే. అయినా తప్పటడుగులు మాత్రం ఎరుగనిది ఈ ఎనిమిదేళ్ల బాల.

దాదాపు ఐదారు సంవత్సరాల క్రితం ఒక స్నేహితురాలు, 'కౌముది లో మళ్లీ ఏమీ రాయలేదా?' అని అడిగితే ఆశ్చర్యపోయాను. అప్పటికి నేను కౌముది పత్రిక ని చూడలేదు. 2007, డిసెంబరు కౌముది సంచికలో నా కవిత ఒకటి తను చూసినట్టు చెప్పింది.

ప్రకృతి మనందరికీ అందించే వెన్నెల లాగే కౌముది మాస పత్రిక కూడా నెలనెలా మన గుమ్మాల్లోకి వెన్నెల వెలుగుల్ని కుమ్మరిస్తోంది. కాని ప్రకృతి ఇచ్చే వెన్నెల కోసం అరుగు మీదకో, ఆరుబయటకో వెళ్లాలి, కౌముది వెన్నెల్ని అరుగు దిగకుండానే గదిలో కూర్చుని ఆస్వాదించవచ్చు.

చిక్కని అరణ్యంలాటి తెలుగు సాహిత్యంలోని సౌరభాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మన తెలుగువారందరికీ పంచుతూ మన మధ్య స్నేహవారధుల్ని కడుతోంది.

గతకాలపు అద్భుతమైన సాహితీ సంపదని అందిస్తూ వర్తమాన రచనలను ప్రోత్సహిస్తూ , భవిష్యత్తులోకి సాహితీ దారుల్ని పరుస్తూ వెళ్తోంది. ఆ దారుల వెంట వెన్నెల ప్రవాహాలు.

సాహిత్యంలో ఉన్న అన్ని పార్శ్వాల్ని పలకరిస్తూ అన్ని రంగాల్లోని వారినీ కలుపుకుంటూ రావటం చాలా బావుంది. జీవితంలో ఎవరి అనుభవాలు వారివే. ప్రతి అనుభవమూ విలువైనదే. ఎన్నెన్నో అనుభవాల సమాహారాన్ని నెలనెలా కాలంతో పోటీ పడుతూ ఖచ్చితమైన సమయానికి అందించటం ఒక సంప్రదాయంగా చేసేరు కౌముది కార్యకర్తలు.అవును కార్యకర్తలే.

ఒక ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎడిటర్ గారు చెప్పినట్లు పంక్చ్యువాలిటీ, డిసిప్లిన్ నిజంగానే వారికి ఒక బలహీనత కాబోలనిపిస్తుంది.

సీనియర్ రచయితల రచనలు, వర్తమాన రచయితల రచనలు, కవితలు, సినీ కౌముది, హాస్య కౌముది, వ్యాసాలు, పుస్తక పరిచయం, యాత్రా స్పెషల్, అనగనగా ఒక మంచి కథ, పాఠకుల శీర్షికలు, ఇలా పత్రిక చదివే ప్రతివారూ పత్రిక పుటల్లో భాగస్వాములు అయ్యే అవకాశం కల్గించటం అభినందిచదగ్గ విషయం .

పాత సంచికలను ఒక్క క్లిక్ దూరంలో అందుబాటులో ఉంచటం ఎంతో బావుంది.

కౌముది గ్రంథాలయంలో కథలు, కవితలు, నవలలు వేటికవి ప్రత్యేకంగా పుస్తకాలుగా రూపొందించి భద్రపరచటం ఒక క్రొత్త ఆలోచన. ఇది రచయితలకీ, పాఠకులకీ కూడా మంచి అవకాశం. రచయితలకి తమ రచనల పట్ల బోలెడు నిశ్చింత.

ఇన్ని పనులనూ వ్యక్తిగతవృత్తి జీవితంలో బిజీగా ఉంటూ కూడా , ఎలాటి లాభాపేక్ష లేకుండా చెయ్యటం అభినందించదగ్గ విషయం.

ఇన్నిన్ని అభినందనలా .........అంటే , మరి మంచి పనులకి అభినందనలేకదా అందేవి.

ఇన్ని అభినందనలమాలలు మోయలేని బరువులవుతాయేమో !

కానీ ఈ మాలలు అన్నీ వెన్నెల దారాలతో అల్లిన వెలుగుపూల మాలలు.

ఈ అభినందనలన్నీ వెన్నెల్లో చల్లదనమంత వాస్తవాలు!

వీటిని మన ఎడిటర్ దంపతులు సవినయంగా మోస్తారని మనందరికీ తెలుసు.

ఇది కౌముది కి మొదటి వందవ సంచిక!

అవిగో, ఇలాటి వందలు మరెన్నో సమీప భవిష్యత్తులో కాంతికిరణాల వెలుగులో కనిపిస్తూనే ఉన్నాయి .

రండి , అరుగు దిగకుండానే ఆస్వాదిద్దాం మన "కౌముది" ని.

చివరగా ఒక ఆలోచన...........కౌముదిలో ఇతర భాషా కథలు అనువాదాల రూపంలో పరిచయం చేస్తే బావుంటుందేమో. ఆ విధంగా భారతదేశంలోని నలుమూలలా ఉన్న సమాజం మనకి మరింత దగ్గరవుతుందేమో.

### సుధ నాగళ్ల



ముందుగా కౌముదికి శత సంచిక శుభాకాంక్షలు!! లాభాపేక్ష లేకుండా ఒక పత్రికని ఉచితంగా ప్రపంచం నలుమూలల్లో ఉన్న తెలుగు వారికి నెల నెలా క్రమం తప్పకుండా అందిస్తున్నందుకు కిరణ్ ప్రభ గారికి, ఆయనకి సహకరిస్తున్న కాంతి కిరణ్ గారికి అభినందనలు. సంపాదకీయం ద్వారా ప్రతి నెలా ఎంతో విలువయిన కొత్త సందేశాల్ని అందిస్తున్నందుకు ధన్యవాదాలు. కవర్ పేజీ రూపొందించటం వెనుక ఉన్న దీక్ష మనకి కవిత చదివినప్పుడు అర్థం అవుతుంది. ఒకసారి కాంతి గారు ఇండియా వెళ్ళినప్పుడు ఎక్కడో మంచి పెయింట్ కనపడితే కౌముది కవర్ పేజీకి పనికి వస్తుందని ఫొటో తీసుకున్నానని చెప్పారు. అంటే తను ఆ పనిని ఒక భాద్యతలా కాకుండా ఇష్టంగా చేస్తున్నారని అనిపించింది. నిజంగా ఇది అభినందనీయం. పాఠకులకి బోర్ కొట్టకుండా ఉండటానికి ఎప్పటికప్పుడు కొత్త శీర్షికలని పరిచయం చెయ్యటం, అవి వైవిధ్యంగా ఉండేలా చూడటం శ్లాఘనీయం. నెల నెలా పత్రికని అందించటమే కాకుండా పాఠకుల సౌలభ్యం కోసం గ్రంధాలయాన్ని తయారు చేసి ఇవ్వటంలో కౌముది మరో మెట్టు పైన ఉంది. పాఠకులని రచయితలుగా చేసిన ఘనత కౌముదిది! పాఠకులని స్నేహితులుగా చేసుకున్న ఘనత కాంతి గారిది!! కేవలం ఇద్దరు వ్యక్తులు కౌముదిని నిరాటంకంగా కొనసాగించటం అనేది చెప్పుకోతగ్గ విషయం. ఏ టైంలో ఫోన్ చేసినా చెప్పమ్మా అంటూ ఆప్యాయంగా పలకరించే కాంతిగారి లాంటి స్నేహితురాల్ని నాకు పరిచయం చేసిన కౌముదికి సదా ఋణపడి ఉంటాను. కౌముది ఇలాగే కలకాలం సాహితీ వెన్నెలని మా పాఠకులందరికీ పంచాలని కోరుకుంటున్నాను!!!

### మన్నెం శారద



కౌముది దినదిన ప్రవర్ధమాన మవుతూ నూరవ సంచికకి చేరుకోవడం ఎంతగానో సంతోషాన్ని కలిగిస్తోంది దీనివెనుక కిరణ్ ప్రభ ,కాంతి కిరణ్ ప్రభ గారి కృషి ,క్రమశిక్షణ కవరు నుండి చివరి దాక ప్రస్ఫుటంగా ప్రతి అక్షరం లోను కనిపిస్తుంది . మాగజైన్ నడపటం అన్నది ఎన్ని వ్యయ ప్రయాసలతో కూడుకున్నదో ,ఎంత సమయాన్ని త్యాగం చేయాలో కాంతి గారు ఇండియా వచ్చికూడా పనిచేయడం స్వయంగ

చూశాను . భార్యా భర్తల అభిరుచి కూడా ఒకటి కావడం ఎంతో ముదావహం, ప్రతినెలా ఒకటో తారీఖున ప్రభాత గీతం పాడే కౌముది మరింత శోభాయ మానంగా ప్రతి అక్షరం ఒక దివ్వెయి వెలగాలని మనసారా కోరుతూ ......

**దివ్యజ్యోతి నడిపినేని**



2007లో మొదలైన మీ కౌముది ప్రయాణం గురించి నాకు కాస్త లేట్‌గా 2009 చివరలో కానీ తెలియలేదు. అమెరికా నుండి వచ్చిన నా చిరకాల స్నేహితురాలు పద్మజ మాటల సందర్భంలో కౌముది గురించి ప్రస్తావించినప్పుడు తెలిసింది అర్జెంటుగా ఇంటికి వస్తూనే తను ఇచ్చిన లింక్ క్లిక్ చేశాను. And to my surprise ఈ was really overwhelmed with this wonderful magazine. ఇక కంప్యూటర్ ముందు నుండి కదలలేదు. పాత సంచికలన్నీ రెండుమూడురోజుల్లోనే కంప్లీట్ చేసేసాను. ఆ రోజు నుండి ఈరోజు దాకా ప్రతి నెలా మీకన్నా ఎక్కువ ఆసక్తితో ఎదురు చూస్తున్నాను. ఇప్పుడైతే ఒకటో తేదీ ఉదయమే లేవగానే చేసే పని కౌముది ఓపెన్ చేసి (పక్క మీద నుంచి ఫోన్లోనే) ముందుగా కవిత, వెంటనే సంపాదకీయం పూర్తి చేసాకే కాళ్ళు కిందపెట్టడం అలవాటైంది. ఇంతకాలం పాఠకుల్ని మెప్పించేలా ఒక ఆన్‌లైన్ పత్రికని నడపడం నిజంగా అభినందనీయం. ప్రతి సంచిక ఆసక్తికరంగా, అద్భుతంగా తీర్చిదిద్దుతున్న మీ ఇద్దరికి నా మనఃపూర్వక అభినందనలు.

కౌముది ద్వారా ఎంతో మంది సాహితీ ప్రియులతో ఎన్నో మంచి పుస్తకాల గురించిన సమాచారం కూడా అందడం ఇంకో చెప్పుకోదగ్గ విషయం. మీరిరువురు ఇలాగే మరెన్నో సంచికలతో, మరిన్ని మంచి శీర్షికలు పుస్తకాలు మాకు పరిచయం చేస్తూ ఈ ప్రయాణం ఇలాగే ఆహ్లాదకరంగా చిరకాలం సాగాలని ఆకాక్షిస్తూ.. ఈ వందవ సంచిక సందర్భంగా మా అందరి అభినందనలు..!

**ఎమ్వీ రామిరెడ్డి**



నిజం చెప్పొద్దూ, కౌముది వెబ్‌జైన్ ప్రారంభమైన కొత్తలో, ఇది కూడా మఖలో పుట్టి పుబ్బలో ఆగిపోయే పత్రికల్లో ఒకటి కాబోతుందేమో అనుకున్నాను. ఆ అనుమానాన్ని పటాపంచలు చేస్తూ 'సెంచరీ' కొట్టబోతున్న కౌముదికీ, ఈ శుభసందర్భానికి కారణభూతులైన కిరణ్‌ప్రభ దంపతులకు అభినందనలు.

ఠంఛన్‌గా ఒకటో తేదీనే అంతర్జాలంలో పత్రిక ప్రత్యక్షం కావడం వెనక ఎన్ని వ్యప్రయాసలు

వ్యయమవుతాయో తెలిగ్గానే ఊహించవచ్చు. ఈ తరం చదవలేకపోయిన అద్భుతమైన నవలల్ని మళ్ళీ అందించడం ఎంతోమందికి అయాచిత వరం. సరికొత్త ధారావాహికలు అదనపు బోనస్. వీటితోపాటు కథలు, కవితలు సహజంగా సాహిత్య పత్రికలో చోటు చేసుకుంటాయి. కానీ, కౌముది చాలా అడుగులు ముందుకేసి, మరిన్ని విభిన్న శీర్షికలకు శ్రీకారం చుట్టింది.

టాక్‌షో, గొల్లపూడి వీక్లీ కాలం 'కౌముది' ప్రత్యేక ముద్రలు. పాటలోని పారవశ్యాన్నీ, పారమార్థిక వైశిష్ట్యాన్నీ వివరించే సుద్దాల అశోక్‌తేజ ప్రతినెలా ఒక కొత్త ఉత్తేజాన్ని దాఖలు పరుస్తారు. తన నవలల వెనక కథను వివరించే మల్లాది వారి శీర్షిక పత్రికకే ప్రత్యేకం. హాస్యాన్ని ఏ మాత్రం రుచి తగ్గకుండా వండి వడ్డించేందుకు కార్టూనిస్టులు, కాలమిస్టులతో నిరవధిక కసరత్తు చేయించడం వెనక కిరణ్‌ప్రభ ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయం. గాసిప్పులు, టైం పాస్ న్యూస్‌క్లిప్పుల జోలికి పోకుండా 'సినీకౌముది'కి పెద్దరికాన్ని కట్టబెట్టారు. అరుదైన విశేషాలతో 'వ్యాసకౌముది'ని నిలబెట్టారు.

మొత్తం మీద నెలనెలా షడ్రసోపేత సాహితీ విందు 'కౌముది'. ముఖచిత్రం సాక్షిగా కిరణ్‌ప్రభగారు రాసే కవితా సుహృల్లేఖ ఆ విందు భోజనానికి ఆహ్వానపత్రిక.

మరో వెయ్యి సంచికలు నిర్విఘ్నంగా అంతర్జాలంలో రెక్కలు విప్పుకోవాలని నా ఆకాంక్ష.

**మణి వడ్లమాని**



కౌముది పత్రికని మొట్టమొదటగా నేను 2010 అమెరికాలో చూడటం తటస్థించింది. అప్పటికి నాలుగు వసంతాలు ఉన్నాయి కౌముదికి. నాకు అప్పుడప్పుడే ఇంటర్నెట్' గురించి తెలిసింది. ఆ కుతుహలంతో సెర్చ్ చేయడం ద్వారా నేను తెలుగు వెబ్ సైట్స్ చూస్తున్నప్పుడు కౌముది పేరు కనిపించింది. ఆ పేరే ఆహ్లాదంగా అనిపించడంతో అదేమిటో చూడాలనే ఆసక్తి కలిగింది. పుస్తకాలు ఎక్కువగా చదివే అలవాటు ఉన్న నాకు కౌముది పత్రికను చూసిన వెంటనే తబ్బిబ్బు అయిపోయాను. అది చదవనా, ఇది చదవనా , ప్రతి పేజీ నన్ను పిలుస్తున్నట్లు ఉండేది. కన్ను తిప్పితే మాయమవుతుందేమో అనే భయం.

కాని తరువాత తెలిసింది అది ఎప్పుడు కావాలంటే అప్పుడే చదువుకోవచ్చు అని. ఆ విధంగా అమెరికాలో ఉన్న 5 నెలలలో నాకు అత్యంత ఆత్మీయురాలు నా నేస్తం కౌముదే! చిత్రం ఏమిటంటే నేను ఏ పత్రికని అయితే అమితంగా ఇష్టపడి చదివే దాన్నో ఆ పత్రికలో కవితలు, నా మొట్టమొదటి కథ రావడం ఎంతో ఆనందం అనిపించింది.

కొత్త రచయితలను ప్రోత్సాహించడంలో తనకు తనే సాటి అనిపించుకుంటోంది కౌముది.

రమణిగారి కాలం దాటని కబుర్లు, ఫణి డొక్కా టేకిట్ ఈజీ, సత్యం మందపాటి గారి పద్యాలూ, మా క్వీన్ విక్టోరియా అంటూ చెప్పే రాజు గారి కథలు చదువుతూ వెన్నెలంత చల్లగా, శారద రాత్రులలో కౌముది సాహితీధారలని ఆస్వాదించే దానిని.

కథాకేళి కస్తూరి మురళి గారు విన్నూత్నంగా రాసిన కథలు, వేదుల సుభద్ర అగ్రహారం,మహా నగరం కథలు, మంథా భానుమతి గారి, విజయగారి సీరియల్స్ తో పాటు లబ్ధ ప్రతిష్టులైన గొల్లపూడి గారు, మల్లాది గారు,వీరేంద్రనాథ్ గారు,ఇలా ఎందరివో ఎన్నో ఎన్నెన్నో సాహితీ వెన్నెల కిరణాలను ప్రసరిస్తున్న కౌముదికి'100' సంచికల తో "శతమానం భవతి" అంటూ

కౌముది లో వచ్చిన నా కవిత నుంచి చిన్న కవితామాలికను సమర్పిస్తున్నాను

వెన్నెల ధార! జగతి అంతా నిండిన వెండివెన్నెల ధార!

అంబరం నుంచి వర్షిస్తున్న ఆనంద అమృత ధార!

మొగలి పొత్తి లాంటి చిక్కని తెల్లని, వెన్నెల ధార!

మిల మిల మెరిసే కాంతి కిరణాలు వెదజల్లుతున్న కౌముది ధార!

ఈ సాహితీ ధారని నిర్విరామంగా కురిపిస్తున్న కిరణ్ ప్రభల గారికి కౌముది ముందు ముందు నిత్యనూతనంగా,వెలుగులు కురిపిస్తూ , చైతన్యఝురి లా సాగిపోవాలని మనసార కోరుతూ ...........

**విజయ కర్రా**



తెలుగు సాహిత్యం మరింక ఓ అపురూపమైన జ్ఞాపకం మాత్రమే అనుకుంటూ బ్రతికే రోజుల్లో, 2009 చివరిలో ఓ స్నేహితురాలు కౌముది పత్రికని గురించి చెప్పిన ఆ రోజు నాకింకా గుర్తు.

తిరణాలలో తప్పిపోయిన పిల్లకి అమ్మానాన్న కనిపించినంత సంతోషం వేసింది. అన్ని రోజులు ఆలాఎలా తెలియకుండా గడిపానా అనుకుంటూ ఆ రాత్రే మొట్టమొదటి సంచిక నుండి మొదలు పెట్టి ఓ నెల రోజుల సాహితీ పండగ చేసుకున్నాను. కథలు, కవితలే కాకుండా గరికపాటిగారు వారి అమ్మగారి గురించి చెప్పిన విషయాలు, ఇంకా కాలమ్ దాటని కబుర్లు అంటూ కాలాన్ని నవ్వుల బండి పైన ఇట్టే దాటించే రమణిగారి కబుర్లు ఇంకా ఎన్నెన్నో శీర్షికలు అపురూపంగా వెతికివెతికి మరీ చదువుకున్నాను.

ఇండియాలో వుండగా ఓ కథా రెండు శీర్షికలు రాసి ఆహా అది నేను చెయ్యగలిగే పని కాదులే అని తీర్మానించుకుని ఏళ్ళు గడిపేస్తున్న నన్ను ఆ చివరి కాలమ్ "మీరూ రచయితలే" అంటూ ఊరించి ఊరించి ఉలిక్కిపడేలా చేసేది. ఇంకా లాభం లేదని నాకున్న పదహారు ఆలోచనలలో ఓ రెండిటికి కథారూపం ఇచ్చి మా అమ్మాయిని ఓ వేలు పట్టుకోమని రెండో కథ మొదట పంపించాను. ఈమైల్ పంపిన గంటకే కథ బావుంది ప్రచురిస్తామన్న కిరణ్ ప్రభ గారి రిప్లై మరో అపురూపమైన జ్ఞాపకం.

అలా నన్ను రచయిత్రిని చేసిన కౌముది పత్రికకి శతకోటి ధన్యవాదాలతో... అతి చక్కని పత్రికని అత్యంత సమర్థవంతంగా నడుపుతున్న కాంతిగారికి, కిరణ్ ప్రభగారికి ఈ వందో సంచిక సందర్భంగా సహస్రకోటి అభినందనలతో ..

**సన్నిహిత్**

ఆరేళ్ల క్రితం ఒక సాహితీ మిత్రుడి ద్వారా కౌముది నాకు పరిచయం అయింది. బలభద్రపాత్రుని రమణి గారి కాలం చదవడం కోసం ఓపెన్ చేసాను. అంతవరకూ వెబ్ పత్రికలంటే ఒక రకమైన చిన్న చూపు ఉండేది నాకు. కానీ ఒక్కసారి కౌముది చదవడం మొదలు పెట్టాక ఆ అభిప్రాయం పటాపంచలైపోయింది. అప్పటి నుండి ప్రతీ నెలా తప్పకుండా చదువుతున్నాను. అన్నిటికంటే గొప్ప విషయం ఇక్కడ పాఠకుడు రచయితలతో డైరెక్ట్ గా ఇంటెరాక్ట్ కాగలిగే అవకాశం ఉండటం. నా లాంటి వర్ధమాన రచయితలకు ఇది ఎంతో ఉపయోగకరం కదా. ఇక పత్రికలో ఉన్న రక రకాల సాహితీ ప్రక్రియలు ( కథ, కవిత, సీరియల్స్, కాలంస్, ....ఇంకా ఎన్నో ) చాలావినూత్నంగా ఉంటున్నాయి. ఇది కమర్షియల్ పత్రిక కాదు కాబట్టి వీలైనన్ని పార్శ్వాలని

స్పృశించాలనే ప్రయత్నం కనపడుతూ ఉంటుంది. పాఠకుడు మెచ్చేదానితో పాటూ అతడి విజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నంకూడా కనపడుతూ ఉంటుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో ఉంది.

ఇంకా ఎన్నో కొత్త నడవడికలతో మరింత వినూత్నంగా కలకాలం కౌముది జీవించాలని కోరుకుంటున్నాను. కిరణ్ ప్రభ దంపతులకు వారి అవిరళ కృషికి గానూ అభినందన ప్రణామాలు.

❀❀❀❀

**కిడాంబి రఘుపతి**



నేను గత నాలుగు నెలల నుండి మీ (మన ) పత్రిక చదువుతున్నాను. అప్పుడే నూరవ సంచిక ముస్తాబవుతోందంటే ఎంతో ఆశ్చర్యంగా ఉన్నది. పూర్తిగా కథలు ఇతర శీర్షికలు చదవలేదు కాని కవితలు మీవి చదివి నా అభిప్రాయం వెలిబుచ్చాను. మీరు వెంటనే స్పందించారు. సంతోషం. మీరు రాసిన కవితలు లోగడ ఒకప్పుడు పల్లకి వార పత్రికలో చదివాను, ఇప్పుడు రచన ఇంటింటి పత్రికలో ప్రతి నెల చదువుతున్నాను. ఎంతో బావున్నాయి . మీరు నూరవ సంచికకి అభిప్రాయాలు అడిగారు. అది చూసి రాస్తున్నాను. ఇక ముందు మరిన్ని కథలు, వ్యాసాలూ, ధారా వాహికలు చదువుతాను. తెలుగు భాష గొప్పతనాన్ని, తీయదనాన్ని మీరు మరింత వ్యాప్తి చేయాలి. ఇప్పుడు మీరు చేస్తున్నది ప్రశంసనీయము. ఇంకా ఎన్నో రాయాలని ఉంది. అయినా ఎంత రాసినా ఇంకా మిగిలే ఉంటుంది కదా. నాకు కవితలు, వ్యాసాలు, కథలు రాయటం అలవాటు . కొన్ని ముద్రణకు నోచుకొన్నాయి కూడా. ఈ –పత్రిక మంచి రచనలు సభ్యత , సంస్కారవంతమైనవి ప్రచురించాలి. గత సాహిత్యంతో బాటు నేటి సాహిత్యము లోని గొప్ప విశేషాలను పరిచయం చేయండి. ఇంకా మీరు బాలల కోసం కూడా ఒక పేజి కేటాయించండి. మహిళలకు కూడా ఈ రోజుల్లో అందరు సమానమని తెలుసుకదా. విభేదాలు వైషమ్యాలను తగ్గించే సాహిత్యం నేడు ఎంతో అవసరము. నేడే కాదు ఎప్పుడూ అవసరమే. మీరు వాడే భాష సులభంగా ఉంటోంది కాని అప్పుడప్పుడు మన గ్రాంధిక భాషను కూడా పరిచయం చేస్తే ముందు తరాల వారికీ మన భాష మీద పట్టు ఉంటుది. అలా కౌముది తీర్చి దిద్దే అవకాశాన్ని పరిశీలించండి.

తెలుగు భాషలో ప్రస్తుతం వాడుక లో లేని అచ్చతెలుగు పదాలను , సంస్కృత పదాలను కూడా వీలును బట్టి ప్రచురిస్తే బావుంటుంది. ఈ మధ్య రచయితలూ ఎక్కువగా ఆంగ్ల పదాలను వాడుతున్నారు కాని వారు అలా కాకుండా ఎక్కువ తెలుగు పదాలను ఉపయోగిస్తే తెలుగు భాషను మరచిపోకుండా ఉండటమే కాదు వారికి కూడా గుర్తు చేసుకొనే వీలు ఉంటుంది. చదివే వారికి కూడా ఉపయోగకరము. తెలుగు వెలుగు పత్రిక ఆ దిశగా తన వంతు కృషి చేస్తోంది. కౌముది అలా కృషి చేయాలని ఆశిస్తున్నాను.

మనసు కవి ఆచార్య ఆత్రేయ ప్రేమ నగర్ సినిమాలో ఒక పాట రాసారు “తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా “అని అలాగ తెల్లవారి వెలుగు లాటి మన తేట తేట తెలుగు భాష దశ దిశలా వ్యాపించి తన తియందనాలను , సౌరభాలను వెదజల్లాలంటే పత్రికల తోడ్పాటు సహకారం ఎంతో అవసరం. అటువంటి సహకారాన్ని కౌముది వంటి పత్రిక నుంచి ఆశిస్తున్నాను.

కిరణ్ ప్రభగారి సంపాదకత్వంలో కౌముది వేయి వెన్నెలలు కురిపించాలని శత వసంతాలను అందించాలని కోరుకుంటున్నాను.

ꕥꕥꕥꕥ

**కాండూరి శేషాచార్యులు**

ఇటీవలే కౌముదిని చదవడం ప్రారంభించాను. చాలా ఇష్టంగా అన్పించింది. నా లాంటి సాహితీ అభిమానులకు ఈ పత్రిక పండుగ లాంటి ఆనందాన్ని పంచింది. తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే ఆలోచనతో మన ముంగిట్లో విరిసిన కౌముదిని విజయవంతంగా నడిపిస్తున్న'కిరణ్ ప్రభ' గారికి కృతజ్ఞతలు. వందవ సంచిక సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు. సహ సంపాదకురాలు ' కాంతి కిరణ్ ' గారికి .సాంకేతిక సహకారం అందిస్తున్న వేణు శ్రీకాంత్ గారికి అభినందనలు. సాహితీసేవలో 'కౌముది' ది ఓ ప్రత్యేక స్థానమని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కౌముది పాఠకులకు, సాహితి అభిమానులకు మరియు రచయితలకు ఈ వందవసంచిక వరకు సాగిన ప్రయాణం ఎంతో సంతోషాన్ని కల్గిస్తోంది.

'సంపాదకీయం' మానవ జీవితం లోని వేర్వేరు కోణాల నుండి స్పృశిస్తూ సమాజ హితాన్ని కోరుతోంది. దీనిని అందించడమే కాకుండా, ప్రతీ ఒక్కరి అభిప్రాయాలకు ప్రతిస్పందన తెలియ చేస్తూ సాగుతున్న ' కిరణ్ ప్రభ ' గారికి ధన్యవాదములు. వందవ సంచిక వరకు విజయవంతంగా సాగిన ఈ సాహితీ ప్రయాణానికి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు ఈ సందర్భం పాఠకులకు , సాహితీ అభిమానులకు , రచయితలకు ఎంతో సంతోషాన్ని కలగచేస్తోంది.

. గొల్లపూడి మారుతి రావు గారి జీవన కాలం కాలానుగుణంగా చోటుచేసుకుంటున్న వివిధ అంశాలపై వారి అనుభవాన్ని రంగరించి అందరికి విజ్ఞానాన్ని పంచుతోంది. తెలుగు పాటల ప్రియులను సుద్దాల అశోక్ తేజ గారి ' పాటే నేనుగా ' అలరిస్తోంది. మల్లాది నవలలు ఎంత ప్రాచుర్యం పొందాయో మనకు తెలుసు. ఆ నవలల వెనుక కథను కౌముది ద్వారా తెలుసుకోగల్గుతున్నాము. ఇంతకు ముందు చదవలేక పోయిన సాహిత్యాన్ని పునర్ముద్రణల ద్వారా చదివే అవకాశం కల్పిస్తోంది. సిరివెన్నెల తరంగాల నుండి పాటల ప్రాధాన్యతను తెలుసుకొగల్గుతున్నాము. నవలా రచయితగా ప్రఖ్యాతి గాంచి , వ్యక్తిత్వ వికాసంపై ఎన్నో రచనలు చేసిన యండమూరి గారి పిల్లల పెంపకంపై రచన ఎంతో ఉపయుక్తంగా ఉంది. ధారావాహికలన్నీ ఆసక్తిగా ఉన్నాయి. ఈ పత్రికకు ఇంతగా పేరు తీసుకొస్తున్న ప్రతీ ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు .

కథలకు, కవితలకు అగ్రతంబూలాన్ని ఇస్తోంది కౌముది. ముఖ్యంగా ఎంతో మంది రచనలు చేయడానికి ప్రోత్సాహం కల్పిస్తోంది. వ్యాసాలూ, శీర్షికలు బాగుంటున్నాయి. హాస్యాన్ని పంచుతోంది 'నవ్వులే నవ్వులు'. సినిమా సంగతులను సినీ కౌముది వివరిస్తుంది. ఇలా ఒకే పత్రికలో సాహిత్యానికి సంభందించిన పలు ప్రక్రియలను సమతుల్యంగా సాగేందుకు గొప్ప విజయం సాదించింది కౌముది.

కౌముది నూరవ సంచిక సందర్భంగా మరొక్కసారి శుభాకాంక్షలు తెలియచేస్తూ , ఈ పత్రిక మరెన్నో సంచికలతో సాహితీ ప్రపంచంలో విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.

ꕥꕥꕥꕥ

**శ్రీనివాస్ కొమ్మిరెడ్డి**



కౌముది వెబ్ మాస పత్రిక వందో సంచిక మైలు రాయిని చేరుకుంటున్న ఈ శుభ తరుణంలో మీకు హృదయపూర్వక శుభకాంక్షలు.

If possible, please make a Ebook with all of your editorial pages of Koumudi web magazine till date and publish it as special gift for 100th issue of koumudi magazine for the readers. Editorial pages of swathi editor vemuri balaram were published as book called "swathi chinukulu". In the similar way, your editorial pages are so inspirational and motivational to the readers. Please consider this, if it is possible for you.

**లక్ష్మి. పి.**

మీ కౌముది పత్రిక మాకు ఎంతో నచ్చే పత్రిక. మీరు గతసంచికలు లైబ్రరి ఒక పద్ధతిలో ప్రచురించడము వలన మేము ఎప్పుడు కావాలంటే అప్పుడు చదువుకోగలుగుతున్నాము. అందుకు మీకు ధన్యవాదాలు. మీ కౌముది పత్రికలోని కాలం దాటని కబుర్లు మరియు సంసారంలో సరిగమలు నా అభిమాన శీర్షికలు. చక్కని కథలు కొత్త, పాత ధారావాహికలతో నిత్య నూతనంగా వుండే మీ ,మన కౌముది మరెన్నో వందల సంచికలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**సురేష్ ఆడెపు**



జనవరి 2007లో అంతర్జాల ప్రపంచంలో ఒక నూతన పత్రిక కౌముది ప్రకాశించడడం మొదలు పెట్టింది. ఆ ప్రకాశవంతమైన కౌముది వెలుగులు మన మాతృభాష తెలుగులో పాఠకులకు కనువిందు చేస్తూ, తెలుగుతల్లి ఒడిలో సేదతీరుతూ, పాఠకులను మంత్రముగ్ధులను చేస్తూ శతమాసాల వసంతంలో అడుగుపెడుతోంది.

కౌముదిలో వచ్చే కథలు, కవితలు వీక్లీ కాలమ్స్, ధారావాహిక నవలలు, హాస్యకథలు మరియు వ్యాసాలు అన్ని మనకు నచ్చినవే. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేలా అన్నీ మనకోసమే తీర్చిదిద్దారు.

ఒక కుటుంబానికి కావాలసిన సామాగ్రిని ఎలా మనం ఒకటో తేదీన కుటుంబానికి సమకూర్చుకుంటామో, అలా నెలకు సరిపోయే తెలుగు పాఠకుల పత్రిక కౌముది మాకు ప్రతినెలా ఒకటో తేదీన అందిస్తున్న కిరణ్‌ప్రభగారికి శతకోటి వందనాలు.

మానవులు జాతులుగా, దేశాలుగా, ఖండాలుగా విభజించి నివసిస్తున్న అవనిపై తెలుగువారందరికి రోడ్లు వేయని దారులుగా, సరిహద్దులు లేని దేశంగా, ఖండంగా మనందరిని ఒకే వేదికపై కలుపుతున్న కౌముది పత్రికకు సర్వదా కృతజ్ఞుడను.

**హిమబిందు . ఎస్.**

కౌముది వందవ సంచిక సందర్భంగా శుభాకాంక్షలు! మీ శ్రమ, ప్రేమ, దీక్ష లను రంగరించి తెస్తున్న కౌముది వెలుగులు ఎప్పటికీ ప్రకాశించాలని కోరుకుంటూ ...

డా.వైదేహి శశిధర్



కౌముది మాగజైన్ ప్రారంభ సంచిక వెలుబడినపుడు కిరణ్ ప్రభ గారి నుంచి ఈ మెయిల్ అందుకోవటం ఇంకా గుర్తు ఉంది. అప్పుడే 99 సంచికలు పూర్తయ్యాయంటే నిజంగా నమ్మశక్యం కావటం లేదు . ఈ 99 సంచికలలో ఒక్క సంచిక కూడా ఒక్క రోజైనా ఆలస్యం అవకపోటంనాకు చాలా ఆశ్చర్యం కలిగే విషయం. అది సాధ్యం కావటానికి సంపాదకులు ఎంతటి దీక్ష,పట్టుదల ,శ్రమ చాకచక్యం ఏకాగ్రత ఓపిక కలిగి ఉండాలో ఊహించుకోవచ్చు .

చాలాసార్లు ఒక్కొక్క పత్రికకు ఒక్కొక్క విభాగంలో బలం ఉంటుంది. కధలు/కవితలు, వ్యాసాలూ వగైరా అన్ని సాహిత్య ప్రక్రియలకు సమాన మైన శ్రద్ధ చూపించే పత్రికలు తక్కువే. అంతేకాదు నాకు తెలిసి అంతర్జాల పత్రికలలో క్రమం తప్పకుండా సీరియల్స్ ప్రచురించే పత్రిక కూడా కౌముది అని చెప్పాలి. తెలుగు నాట ప్రముఖ పత్రికలకు ఉన్న అన్ని హంగులని కలిగి అంతర్జాలంలో లభ్యమయ్యే పత్రిక కౌముది .

నాకు తెలిసినంత వరకు వెబ్ మాగజైన్ లో ప్రత్యేకంగా పాఠకులకు శీర్షిక కేటాయించింది కౌముది లోనే. పత్రికలో పాఠకుల్ని భాగస్వాములుగా చేయటంద్వారా పాఠకులలో కూడా పత్రిక పట్ల ఒక sense of belonging కలుగుతుంది అలాగే ప్రత్యేక శీర్షికల లో గొల్లపూడి మారుతీరావు గారు, యద్దనపూడి వంటి ప్రముఖ రచయితల తో పాటు అమెరికాలోని ప్రముఖ ప్రవాసాంధ్రుల శీర్షికలు పత్రికకు ఆకర్షణను పెంచాయి. కౌముదికే సొంతమైన మరొక వినూత్న ప్రయోగం ముఖపత్రకవితలు. అందమైన ముఖచిత్రం మొదటినుండీ కౌముది సొత్తే అయినా కవితల అలంకారాల్ని అద్ది సొగసు తెచ్చింది మాత్రం కిరణ్ ప్రభ గారే. ముఖపత్రకవితలు నిస్సందేహంగా కౌముదికి గొప్ప ఆకర్షణ. వ్రాసిన కవిత వ్రాయకుండా ప్రతి నెలాఅంత నిరాఘాటంగా ప్రతి ముఖ చిత్రానికి ఔచితి తప్పని కవితలు వ్రాయగలగటం గొప్ప ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది .

కౌముది ప్రస్థానం చూస్తె ఒక క్రమమైన, పద్ధతి లో పత్రిక ఎదుగుదల మనకు కనబడుతుంది. మొదటి పత్రిక నుంచి క్రమక్రమంగా ఎన్నో వినూత్న శీర్షికలను పెట్టడం ,అలాగే మల్లాది,యండమూరి వంటి పాప్యులర్ రచయితల సీరియల్స్ ను మరలా అందించటంతో పాటు వారి వ్యాసాలను ప్రచురించటం వంటి ప్రక్రియలతో పాటు కిరణ్ ప్రభ టాక్ షో పత్రిక కు కొత్తదనాన్నిఇచ్చే అదనపు ఆకర్షణలని చెప్పవచ్చు .

ఇంత విజయవంతం గా ఈ పత్రిక కొనసాగటానికి కిరణ్ ప్రభ గారి నిబద్ధత , సంయమనం, వివాద రహిత ప్రకృతితో పాటు కాంతికిరణ్ గారి కృషి ,సహకారం కూడా ఉందని అందరికి తెలిసిన విషయమే. వారిద్దరికి కౌముది నూరు నెలల పండగ సందర్భంగా అభినందనలు. మరెన్నో సంవత్సరాలు వారి కృషి ఇలాగే విజయవంతం గా కొనసాగాలని ఆశిస్తున్నాను.

నాగలక్ష్మి వారణాసి



*సాహితీ కాంతి కిరణాలకు అభినందన*

క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తారీకున
నా ఒడిలోకెక్కే నెమలికి
పురి విప్పితే ఎన్ని కన్నులో ఎన్ని వన్నెలో!
భావాంబర వీధిలో ముసురుకునే కొత్త ఊహలన్నీ
ఈ సాహితీ మయూరపు పింఛాలై విచ్చుకుంటాయి.

సృష్టి కర్త ఒక్కో పింఛాన్నీ ఒక్కో ప్రత్యేకతతో
సృజించి అమర్చినందువల్లో ఏమో
పొందిగ్గా ముడుచుకున్నా,
ముచ్చటగా విచ్చుకున్నా దానికే చెల్లింది!
ఆకాశంలో వాన మబ్బులు ముసిరినప్పుడు
ఏ చెట్టుమీదనించో చెంగున దూకి నర్తించే వయారి,
అక్షరమై సూక్ష్మరూపం దాల్చి
అందంగా నా పేటికలో ఒదిగిపోతుంది.
ముడుచుకున్నపుడు ఎక్కడెక్కడో దాగి ఉండే
ఆ చిత్ర మేఖలపు వన్నెలన్నీ
పురి విప్పగానే ఒక్కొక్కటే తెరుచుకుని
సౌందర్యాన్ని నిర్వచించ పూనుకుంటాయి.
సాహితీ పిపాసకులు మాత్రమే దర్శించగలిగే ఆ సోయగాలకి
మనో చక్షువులు చెమరుస్తాయి
జ్ఞాన చక్షువులు తెరుచుకుంటాయి.
వన్నెల వెన్నెలకిది నూరవ పండగ.
నెలకొకసారి వర్షించే మేఘమాలికకి ,
మీట నొక్కగానే ప్రత్యక్షమై వెలుగుదారి చూపించే
సాహితీ దీప సమూహానికి,
నవరాగాల మృదు గమకాల విపంచికకి,
ఇది నూరవ సంచిక !
ఆమెకి నూటికి నూరు మార్కులు !

**రావి రంగారావు**

*ఒక పెద్ద మనిషికి ఒక చిన్న అభినందన*



కొంతమంది పని చేస్తుంటే మోతొస్తుంది. మరి కొంత మంది ఎంత కృషి చేసినా ఏ మాత్రం శబ్దం రాదు, వెలుగు మాత్రం అనంతంగా ప్రసరిస్తుంది. అలా నిశ్శబ్దంగా కృషి చేస్తూ తెలుగు భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి వెలుగులు పంచుతున్న కిరణ్ ప్రభ నిజంగా అభినందనీయులు.

కిరణ్ ప్రభ ఒక వ్యక్తి కాదు, ఇద్దరు వ్యక్తులు. కేవలం ఇద్దరు వ్యక్తులు కాదు, ఒక సమైక్య శక్తి. వారిలో ఎన్నో అద్భుతమైన ఆనందం కలిగించే, చైతన్యం పంచే కోణా లున్నాయి.

1. దాదాపు 50 సం.నుండి అనంతమైన గ్రంథ సంపద పెంచుకున్నారు. ఎక్కడ దొరకని ఎంత పాత పుస్తకం అయినా వారి దగ్గర దొరుకుతుంది. ప్రపంచంలో ఎవరికైనా అందుబాటులో ఉండాలని వాటిని తన కంప్యూటరులో భద్రపరచి కావాలని అడిగినవారికి మెయిల్ ద్వారా పంపుతున్నారు. ఇది మామూలు సేవ కాదు, అనితర సాధ్యమైన సేవ. భాష పట్ల ఎంత తపన ఉంటేనే ఇది సాధ్యం.

2. ప్రతి నెల తన ఉద్యోగ బాధ్యతలు చేసుకుంటూనే ఉన్నత ప్రమాణాలు కలిగిన "కౌముది" అనే అంతర్జాల మాసపత్రికను నడపటం వారిలోని కష్టపడే తత్వానికి, తెలుగంటే ఇష్ట పడే వైఖరికి గొప్ప సాక్ష్యం. ఎందరో అసామాన్యు లైన రచయితల నుండి మరెందరో వర్ధమాన రచయితల రచనలతో "బ్రేక్" లేకుండా ప్రతి మాసం సంచిక తేవటం తెలుగు వారు చేసుకున్న అదృష్టం. ఇలాంటి వారు మనకు తెలుగు నేల మీద కనిపించరు, అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలో తప్ప. వారు విదేశంలో ఉంటూనే స్వదేశంలో ఉంటున్న వారి కంటే గొప్ప సేవ చేయటం నన్ను అబ్బురపరిచే విషయం. ఇందులో మరో మహా సాహస కృషి ఉంది. ఎవ్వరూ చేయలేని "టాక్ షో"...ప్రముఖ వ్యక్తుల గురించి ఎంతో సరళ మైన భాషలో, చక్కని వాచికంతో, ఆత్మీయంగా వివరించే తీరు మనోహరం.

3. వీరిలో మరో కోణం విశిష్ట కార్యకర్తగా పని చేసే లక్షణం. "వీక్షణం" అనే పేరుతో క్యాలిఫోర్నియాలో సాహిత్య సంస్థ స్థాపించి నెల నెలా కార్యక్రమాలు నిర్వహిస్తూ అమెరికాలో కూడా తెలుగు వెలుగులు నిరంతరం కొనసాగేలా చూస్తున్న కృషికి నేను ప్రత్యక్ష సాక్షిని కావటం నాకు ఆనందంగా ఉంది. అమెరికాలో ఉన్నన్నాళ్ళు నేను ఆ కార్యక్రమాలలో పాల్గొని ఎన్నో విషయాలు నేర్చుకున్నాను కూడా.

4. ఇక వీరు మంచి కవులు, రచయితలూ కూడా. 1970 నుంచి అనుకుంటా... ఆనాటి పత్రికలల్లో ఎన్నో రచనలు వారివి నేను చదివిన జ్ఞాపకం ఉంది.

అసలు అన్నిటికీ మించి వీరు మంచి మనుషులు. ఎంత గొప్ప సాహిత్యం పండించినా మంచి మనుషులు కావటం చాలా కష్టం. మాట ద్వారా కాని, చేత కాని ఎవ్వరిని నొప్పించరు. సందర్భం లేకుండా ఎవరినీ పొగడటం కూడా చేయరు. సముచితమైన సందర్భంలో సముచితంగా స్పందించే ఆదర్శ వ్యక్తులు వీరు అని ఒక్క వాక్యంలో చెప్పటం నా కిష్టం.

**యమున చింతపల్లి**



మీ (మా) కౌముది పత్రిక 100 సంచికలో అడుగుపెడుతున్నందుకు అభినందనలు. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా కౌముదితో అనుబంధం.

మొట్టమొదటి ఆకర్షణ ఫ్రెంట్ పేజీ లో మీ కవిత. విభిన్న కధాంశాలు. నవ్వించే బలభద్రపాత్రుని రమణి గారి 'కాలం దాటని కబుర్లు , మల్లాది గారి 'నవల వెనుక కథ' ......బాగుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కౌముది 'వెన్నలపూల' బొకే .

జీవితభాగస్వాములు ఒకే మాట, ఒకే బాట అన్నట్లుగా ఉంటె ఏ రంగములో అయినా విజయం తధ్యం అనేదానికి మీరే ఉదాహరణ. ఇలాగే మరిన్ని విజయాలని అందుకుంటూ , మాకు ఆనందాన్ని అందిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.

ఇంకొక్క విషయం చెప్పాలని పిస్తోంది. పైనవన్నీ ఒక ఎత్తు. మీ కవిత, సంపాదకీయం చదివి అభిప్రాయం తెలియచేసే పాఠకులకు మీరు స్పందించి ధన్యవాదాలు తెలియచెయ్యటమో, ఒక్కొక్కసారి వివరణయివ్వడం.... మాలాంటి క్రొత్త రైటర్స్ పంపిన కథలు అందగానే జవాబివ్వటం అభినందనీయం. ఆ వినయసంపద నేర్చుకోతగ్గది. అలాంటి స్పందన,గౌరవం ఇతరపత్రికలనుండి కొంత అరుదే అని నా అనుభవంతో నేర్చుకున్న పాఠం. మరొకసారి కిరణ్ ప్రభగారికి అభినందనలు తెలియచేస్తూ శెలవు.

**నూతక్కి రాఘవేంద్రరావు**



సాహిత్యానికి ఓ ప్రామాణికతను నిర్ధారించి, నిరంతరం నిర్ధారిత సమయం లో పాఠకలోకానికి అందిస్తూ నేటికి 100 వ సంచిక .హృదయా అభినందనలు . స్వచ్ఛమైన సాహిత్యాన్ని అందించడమే ధ్యేయంగా కొనసాగించగలగడం, చదువరుల ఆసక్తికి అనుగుణంగా అనేక శీర్షికలతో వినూత్న ముఖ పత్ర చిత్రాలతో ప్రపంచ వ్యాప్తంగా అశేష తెలుగు జనావళి ఆదరాభిమానాలను పొందగలగడం అనితర సాధ్యం. కేవలం కౌముది బండిని లాగే అవిశ్రాంత శ్రామికులు ...ఆ భవ్య దంపతులు "కిరణ్" "ప్రభ" లకు తక్క. వారికి, వారి మానసిక పుత్రిక "కౌముది"కి మరొక్కసారి హృదయా అభినందనలు.

**డా.నారాయణ గరిమెళ్ళ**



కిరణాల ప్రభావాలు
చల్లని కాంతులు చిమ్మి
రేయంత చీకటినీ

పగలంతగా వెలిగించి
మనసుల నుండి మస్తిష్కాల విరబూసే
ఆలోచనా తరంగ రూపమే కౌముది
కిరణ కాంతుల
మానస పుత్రిక
ప్రతి తెలుగింటి
ఉయ్యాలల్లోనూ
ఏ యింటి కా యింటి
పాప గానే
ముద్దుల్లో ముంచింది
ముచ్చట్లు చెప్పింది

ఏ నెల కా నెల
సరికొత్త ముఖ చిత్ర
వర్చస్సుతో వెలుగుతూ
ఇంపైన సొంపైన
కవితను అలంకరించుకుని
నెలల బాలే
ఏడాదుల ఎదిగి ఎగసి
నేర్పే నేర్పరి బాల గా
గుండె గుడిలో కొలువౌతోంది

సంస్కృతీ సాహిత్య సౌగంధాలు
పంచుతూనే ఉంది
జ్ఞాన విజ్ఞాన పాఠాలను
వల్లె వేయిస్తూనే ఉంది

శత సంచికా
కౌముది
సతత హరితారణ్యాల
సహజంగా
తేట తెలుగుల తేనియలు
పంచేందుకు వస్తోంది

తెరచి ఉంచిన
ప్రతి తెలుగు దోసిలినీ
మధుర మాధుర్య
మనో
రసాలతో నింపుతాననే
అంటోంది.

**నిషిగంధ**



ఎప్పుడో స్కూల్లో చదివే రోజుల్లో అనుకుంటాను, పక్కింటి వాళ్ళ దగ్గర మొట్టమొదటిసారి స్వాతి వార పత్రిక, దాని మీద ఉన్న వడ్డాది పాపయ్య గారి ముఖచిత్రం చూసి, ముచ్చటపడిపోయి ఇంటికి తెచ్చుకుని చదవబోతుంటే మా నాన్నగారు గట్టిగా రెండు దెబ్బలు వేసి అప్పటికప్పుడు ఆ పుస్తకం వెనక్కి ఇచ్చేసి వరకూ ఊరుకోలేదు. మూడు, నాలుగు తరగతుల్లోనే శరత్ నవలల్ని చదువుతుంటే ఏ మాత్రం అడ్డుపెట్టని నాన్నగారేనా అంతలా కోపం తెచ్చుకుందీ అని ఆశ్చర్యం వేసింది. అలా అని ఇంట్లో అసలు వార పత్రికల జాడ లేదని కాదు.. ఆయన కాలేజీ రోజుల్లో వార/మాస పత్రికల్లో సీరియల్స్ గా వచ్చిన కథలన్నీ బౌండు పుస్తకాలుగా రూపాంతరం చెంది మిలట్రీ భోషాణం పెట్టెలో ఠీవీగాకొలువు దీరి ఉన్నాయి!! 'అదేమిటని?' అడిగే ధైర్యం అప్పుడు లేదు కానీ తర్వాతెప్పుడో మాటల్లో చెప్పారు, 'సాహిత్యం ఏదైనా మనలో చైతన్యం కలిగించేదిగా ఉండాలి. అలాకాకపోయినా మనల్ని కనీసం కొంత సమయం పాటు ఆలోచింపచేసేదిగా ఉండాలి.. అంతేకానీ మంచీ చెడుల మధ్య గీతల్ని అస్పష్టం చేసేది ఎప్పుడూ సాహిత్యం అనిపించుకోదు' అని! ఆ తర్వాత నేను కాలేజీ అయిపోయి ఉద్యోగం చేస్తున్న రోజుల్లో కూడా ఇంట్లో ఆయన ఎదుట పత్రికలు చదివే ధైర్యం చేయలేకపోయాను!

అలాంటిది గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నెన్ని సార్లు అనుకును ఉంటానో.. నాన్నకి కౌముది పత్రిక ఎంతగా నచ్చి ఉండేదో అని!!

పుట్టిన భూమికీ, తెలిసిన భాషకీ చాలా దూరంగా ఉంటున్నప్పుడు ఆ భాషలో ఏ నాలుగు అక్షరాలు కనిపించినా ఆత్రంగా చదివేయడమే! అలాంటి సమయంలో దాదాపు 35 శీర్షికలూ 200 పేజీలతో ( ఆ రోజుల్లో), ఉత్తమమైన సాహితీ విలువలతో ఒక పత్రిక లభ్యమవుతుంది అంటే ఆ ఆనందానికిక అంతేముంటుంది!! ఆ ఆనందంతో పాటు ఈ పత్రిక కేవలం ఇద్దరి శ్రమతో నడపబడుతుంది అని తెలిసిన క్షణాన అంతే ఆశ్చర్యం కూడా ముంచెత్తింది!!

సాహిత్యాభిలాషకి ఉత్తమ అభిరుచి, నిబద్ధత అనే రెండు మూల స్థంభాలు ఈ ఇద్దరూ! ఒకటి కాదు రెండు కాదు, వంద సంచికలు ఒకటే ప్రమాణంలో నిర్వహించడం అనేది సామాన్యమైన విషయం కాదు!! ప్రారంభమైనప్పుడు ఎంత జాగ్రత్త తీసుకున్నారో ఇప్పటికీ అదే జాగ్రత్త, సంమయనం కనబడుతుంది మొత్తం పత్రికని రూపొందించడంలో!! నాకు చాలా ఆశ్చర్యం కలిగించే విషయం, మధ్యలో పెళ్ళిళ్ళూ, ఆకస్మిక మరణాలూ వంటి అత్యంత సంతోష, దుఃఖ సమయాలలో కూడా ఎప్పుడూ వేళ దాటిన సంఘటనలు లేవు!!

ప్రతీసారీ ఒకటవ తారీఖు పత్రిక విడుదలవ్వగానే చూసేది, ముఖచిత్రమూ, కవిత!! ఒకే వ్యక్తి సృజన ఫలితం అనిపిస్తుంది అది చూసి, చదవగానే!! అలా కాదు, ఒకరు ముఖచిత్రం డిజైన్ చేశారు, ఇంకొకరు కవిత రాశారు అని తెలియగానే ఏది ముందు జరిగింది అనేది మాత్రం ఈనాటికీ భేతాళ ప్రశ్నగానే ఉండి పోయింది. ఒకరి ఆలోచనలు, భావనలు ఇంకొకరితో ఎంతగా మమేకం అవ్వకపోతే ఇలా అనిపిస్తుంది!?

ముఖచిత్రం అంతలానే ఆకట్టుకునేది, నెలనెలా సంపాదకీయం! ఎన్నెన్ని జీవిత సత్యాలు, సూత్రాలూ చిన్న చిన్న ఉదాహరణలతో అత్యంత సరళంగా వివరించేస్తారు! మనకి అన్వయించుకోవడానికి అనువైన మాటల్లో చెప్తారేమో వెంటనే పాటించడానికి ఎటువంటి సందేహాలూ, ఆలోచనలూ రావు! నాకొక్కటే కోరిక, ఈ వంద ఎడిటోరియల్సూ ఒక పుస్తకం చేసి, కౌముది గ్రంధాలయంలో చేరిస్తే చాలా బావుంటుంది!

కౌముది నా సాహితీ జీవితానికి పుట్టిల్లు! ఇక్కడే నేను రాయడంలో ఓనమాలు నించి ఇంకాస్త ఎదిగాను. నాకంటూ ఒక అస్తిత్వాన్ని సంపాదించిపెట్టిన ఈ పుట్టిల్లు గురించి ఏం చెప్పాలన్నా, ఎంత చెప్పాలన్నా అది సరిపోదు, సరి అయిన వ్యక్తీకరణ కానే కాదు అన్న నిస్సహాయత ఆవరించేస్తుంది. ఒక చక్కని సాహితీ ఆవరణలో నా చేత ఒక చిన్న మొక్క నాటబడింది అన్న భావన చెప్పలేనంత ఆనందాన్నీ, సంతృప్తినీ కలగజేస్తోంది!

కిరణ్ ప్రభ గారూ, కాంతి గారూ... ఏ మాత్రం స్వలాభేక్ష లేని మీ ఇద్దరి శ్రమ ప్రతీ నెలా కన్నుల పండగలా ఎన్నో వేల మందిని అలరిస్తోంది! చాలా ప్రయత్నించాను, ఏదన్నా నచ్చని అంశం ఉన్నదేమో, లేక ఇంకా మీనించి అదనంగా శీర్షికలు కావాలనో చెప్పడానికి! కానీ, నా ప్రయత్నాలన్నీ పూర్తిగా భగ్నమయ్యాయి! పైన చెప్పినట్లు ఎడిటోరియల్ పుస్తకం తప్ప నాకేదీ తోచడం లేదు. మాకు ఫలానాది కావాలి అన్న ఆలోచన రాకముందే మీరది ఆచరణలో పెట్టేస్తున్నారు!! మీ మానస పుత్రికని నెలనెలకీ ఇంకాస్త ఎక్కువ అందంగా, అర్ధవంతంగా తీర్చిదిద్దుతున్నారు.


కౌముది వంద సంచికలు పూర్తి చేసుకుంటున్న ఈ సందర్భంలో మీకూ, కౌముది రచయిత(త్రు)లకీ, పాఠకలోకానికీ హృదయపూర్వక శుభాభినందనలు!

**కుమార్, సంధ్య కలగర**



ఆలోచనల్ని రేకెత్తించే వ్యాసాలు
హృదయాన్ని స్పందింపజేసే కవితలు
సరికొత్త కోణాల విశ్లేషణలతో ప్రేరణలు
వినోదం, నవ్వుల విందుభోజనాన్నిందించే ముచ్చట్లు
సారస్వతానుబంధం... సాహిత్యం పట్ల మమకారం
ఇంటింటా కౌముది ఉచిత గ్రంథాలయం
కౌముది పంచే సాహితీ సంపద మనందరికోసం..
మా అభిమాన పత్రిక విజయవంతంగా మీ కాంతి కిరణాల సాహితీ వెన్నెలలో వేల వందల పౌర్ణిమలు ప్రభవించాలని కోరుకుంటూ..

**మధురవాణి**



కొన్నేళ్ళ క్రితం ఇండియా నుంచి దూరంగా వచ్చిన కొత్తల్లో ఎక్కడో చోట ఏదైనా తెలుగులో చదవగలిగితే బాగుండనే కోరిక కొద్దీ ఇంటర్నెట్లో వెతుకులాడుతుండగా 'కౌముది' కళ్ళబడింది. అప్పటికి విడుదలయిన 'కౌముది' 25 సంచికలు చూసి అవన్నీ ఉచితంగా చదివేసుకోవచ్చన్న అప్పటి పట్టలేని ఆనందం ఇంకా స్పష్టంగా గుర్తుంది. నేనూ నా సొంతంగా నాలుగు తెలుగు అక్షరాలు రాసుకోవాలన్న సరదాతో బ్లాగు మొదలుపెట్టాక చాలామంది పాఠకుల్లాగే నాక్కూడా ఏదైనా పత్రికలో నా పేరు చూసుకోవాలనే కోరిక కలిగింది. కథలు రాసే ప్రయత్నం తలపెట్టిన కొత్తల్లో 'కౌముది' స్థాయికి నేను సరితూగగననే నమ్మకం కొద్దీ నేను రాసింది వారికి పంపే ధైర్యం లేక ఊరుకున్నాను. మళ్ళీ నేనే అసలు కథలు రాయడానికి నేను పనికొస్తానా లేదా అనే సంగతి నిర్ధారించుకోవాలని నిర్ణయించుకుని 'కౌముది'కి పంపాను. దానికి సమాధానంగా కౌముది సంపాదకులు కిరణ్ ప్రభ గారి నుంచి వచ్చిన స్పందనే నా రచనాప్రయత్నాలని కొనసాగించగలిగే విశ్వాసాన్ని నాలో కలిగించిందంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు.

చాలామంది పత్రికా సంపాదకుల్లాగా అసలు జవాబే ఇవ్వకుండా ఉండటమో లేక "మీ కథ మా పత్రికలో వేయడానికి అంగీకరిస్తున్నాం లేదా తిరస్కరిస్తున్నాం" అంటూ పొడిగా రెండు ముక్కలు జవాబు ఇవ్వకుండా కొత్తగా రాయాలనుకుంటున్న వారి ఆసక్తితో పాటు వారిలో ఉన్న బలాబలాలని, మెరుగుపరచుకోవలసిన అంశాలని నిశితంగా గమనించి తగిన సలహాలు చెబుతూ కొత్త రచయితలని ప్రోత్సహించడం 'కౌముది' ఆచరించే ఉన్నత విలువలకి ఒక చిన్న ఉదాహరణ. ఏదో చిన్న ఆసక్తితో ఒక కథ రాసి పంపిన నేను కేవలం వారి ప్రోత్సాహం వల్లనే వరుసగా మరి కొన్ని కథలే కాకుండా ఒక నవలని కూడా రాయగలిగానంటే నాకే ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది.

కౌముది కృష్ణపక్ష చంద్రుడి వెన్నెల వెలుగుల్లా క్రమంగా ఎదుగుతూ 100 సంచికలు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం, ఈ విలువైన సాహిత్యప్రయాణంలో కొన్ని అడుగులు పంచుకునే అదృష్టం నాకూ దక్కడం నా మటుకు నాకు చాలా గొప్ప విషయం. 'కౌముది' 100 సంచికల సాహిత్యవిందులో ఎందరెందరో మహామహుల రచనలు, కొత్త రచయితల రచనలు పరిచయంతో పాటు నా రాతలు చదివి స్పందించే అభిమాన పాఠకులను సంపాదించుకునే భాగ్యం కలిగింది. కేవలం సాహిత్యపరంగానే కాక 'కౌముది' పందిరి కింద అల్లుకున్న చక్కటి స్నేహలతలు, ఆత్మీయ అనుబంధాలు అదనంగా దొరికిన పెన్నిధులు.

కేవలం చదువులు, ఉద్యోగాల విషయంలోనే కాదు ఆసక్తులు, అభిరుచుల విషయంలో కూడా లాభాపేక్ష లేకుండా నిజాయితీగా నిబద్ధతతో కృషి చేయడంలో ఉండే సంతృప్తి, సత్ఫలితాలు ఎంత గొప్పగా ఉంటాయో అనుభవపూర్వకంగా చేసి చూపిస్తూ మాలాంటి యువతరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్న 'కౌముది' సంపాదకులకి వందనాలు అర్పిస్తూ, 'కౌముది' ఇలాగే మరిన్ని వందల సంచికలతో తెలుగు సాహితీలోకంలో ధృవతారగా వెలగాలని ఆశిస్తూ ఈ శుభసందర్భంలో మన 'కౌముది' సాహితీ కుటుంబమంతటికీ అభినందనలు మరియు శుభాకాంక్షలు.

**సుజల గంటి**



అది 2004 డిసెంబర్ నెల అమెరికా రమ్మని నా కొడుకు ఫోన్ చేస్తే బయలుదేరాను. మొట్టమొదటిసారి వస్తున్నానన్న భయం కన్నా అక్కడ నాకు కాలక్షేపం ఎలాగా? అన్న మధన నాలో. అప్పటికి నాకు కంప్యూటర్ వచ్చు కానీ అంతా బాగా రాదు. గూగుల్ లో వెతికితే అన్నీ దొరుకుతాయని ఎవరో చెప్పారు. అంతే న్యూజెర్సీ లో ఏమైనా తెలుగు అసోసియేషన్స్ ఉన్నాయా అని వెతికాను. దొరికింది. అయినా అది ఒక్కసారి మాత్రమే వెళ్ళగలను, అదీ వాళ్ళ కార్యక్రమాలు ఉంటేనే. అలా వెతకగా కౌముది దర్శనమయ్యింది. ఓపెన్ చేసి చూసాను.. ఇంక నా ఆనందమేమని చెప్పను? అమ్మయ్య నా కొక నేస్తం దొరికిందన్న ఆనందం తో ఫ్లైట్ ఎక్కాను. ఢిల్లీ నించి లండన్ అక్కడి నించి నువార్క్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నాను. కోడలికి కొడుక్కు వాళ్ళ లాప్ టాప్ లే ఉన్నాయి. నాకు సమయం దొరికినప్పుడల్లా నాకు ఎవరిది ఖాళీ ఉంటే వాళ్ళది ఇవ్వాలని అడిగాను. అలా వాళ్ళిచ్చినప్పుడల్లా కౌముది లోకి జంపింగ్. అలా అలవాటయిన కౌముది పత్రిక వారి గ్రంథాలయం నాకు ఒక టానిక్ లా పనిచేస్తోందంటే అతిశయోక్తి కాదేమో. 2011 దాకా నాకు ఈ పత్రిక ప్రాణంగా ఉండేది. అంటే ఇప్పుడు కాదని కాదు. ఒకటి వెబ్ మాగజైన్ అవడం మూలంగా దేశ విదేశాల్లో ఎక్కడున్నా హాయిగా చదువుకోవచ్చు. రెండవది మీరు ప్రచురించే పాత సీరియల్స్ ఎప్పుడో చదివినవి, కొన్ని చదవ కుండా మిస్ అయి బాధపడ్డవి అన్నీ మీ పత్రిక ద్వార చదవడానికి లభ్యమయ్యాయి. మహామహుల రచనలని మళ్ళి పునర్ముద్రితం చేసి మాలాంటి పాఠకులకు విందు భోజనం అందిస్తున్నారు. కొమ్మూరిగారి రచనలు ఎప్పుడో చిన్నప్పుడు చదివాను. అవి మళ్ళీ చదువుతుంటే చిన్నతనం లోకి వెళ్ళిపోయిన అనుభూతి. మల్లాదిగారివి, యండమూరిగారి రచనలు ఎన్నని చెప్పను? ఇంతకన్నా రాయడానికి మాటలు లేవు. ఇప్పుడు ఆంధ్రదేశం వచ్చి అన్ని పత్రికలు కొంటున్నా ఒకటవ తారీకు పొద్దున్నే లాప్ టాప్ తెరిచి కాఫీ కప్పుతో కౌముది చదవకపోతే నాకు తోచదు. మీ దంపతులిద్దరూ ఈ పత్రికను ఇలాగే నడుపుతూ మాలాంటి వాళ్ళకు అందని ఆణిముత్యాలను అందిస్తూ సదా చల్లగా ఉండాలని కోరుతూ——

**లలిత చిట్టే (లిల్లీ)**



–ఎనలేని సాహితీ విలువలతో పాఠక హృదయాలను దోచుకుంటూ
99 సంచికలను దాటి 100వ సంచికలోనికి ప్రవేశిస్తున్న కౌముదికి శుభాభినందనలు!
కౌముది ప్రారంభించినప్పుడు ఎడిటర్ కిరణ్ ప్రభ గారు నాకు మెయిల్ పంపించి కౌముదికి రచనలు చేయమని ప్రోత్సహించడం ఇంకా నాకు గుర్తు!

మొట్ట మొదటి సంచిక నుండి కౌముదిని వెంబడిస్తూ.. అప్పుడప్పుడూ అందులో రచనలు చేస్తూ కౌముదితో కలిసి కొన్ని ఏళ్ళుగా సాహితీ ప్రస్థానం చేయడం ఎంతో గర్వ కారణం.

అంతే కాదు మృదు స్వభావి.. స్నేహశీలి అయిన కో ఎడిటర్ కాంతి కిరణ్ పాతూరి, ప్రముఖ రచయిత్రి బలభద్ర పాత్రుని రమణి మరియు పద్మజ మల్లాది వంటి గొప్ప వారితో స్నేహం కౌముది వల్లనే లభించడం నా జీవితములో మరువలేని మధుర ఘట్టం.

ప్రతి నెలా.. మొదటి తేదిన తొందరగా నిద్ర లేచి కౌముది.నెట్ అని టైపు చేయగానే కనులను ఆకట్టుకునే చక్కటి ముఖ చిత్రం.. దానికి తగినట్లు మదిని అలరించే అందమైన కవిత కనిపిస్తాయి. ఆ చిత్రాన్ని చూచి మైమరిచి, ఆ కవితా ఝరిలో పులకిస్తూ.. అక్కడ కాసేపు ఆగాల్సిందే..!! వెంటనే కామెంటు పెట్టి అభినందించాల్సిందే..!

తరువాత .. లోపలి పేజిల్లో గొప్ప రచయితల చే వ్రాయబడిన ఎన్నో గొప్ప రచనలు.. ప్రతి ఒక్కటి విడువక చదివి ఆనందించాల్సిందే..!

కౌముది పత్రికతోను.. కో ఎడిటర్ కాంతి కిరణ్ గారితొ అనుబంధం మరువలేనిది. జీవితాంతము విడువలేనిది.!

విలువైన సాహిత్యాన్ని తనలో నింపుకుని.. ప్రపంచమంతటా విహరించి పాఠకుల అభిమానము పొంది "కౌముది కుటుంబము" అనే బంధము ఏర్పరిచిన కౌముది -ఇలాగే.. ఎప్పటికీ సాహితీ వెన్నెలలు విరజిమ్ముతూ.. ప్రతినెలా అందరిని అలరించాలని ఆశిస్తూ..

❀❀❀❀

**అఫ్సర్**



కౌముది అంటే మా నాన్నగారి కలం పేరు కూడా! ఆ రకంగా కౌముది పత్రిక తెరవగానే నాకు ఆ అనుబంధపు పరిమళం తెలుస్తూ వుంటుంది. వొక పత్రిక నిర్వహణ ఎంత కష్టమో నాకు తెలుసు, ఇన్నాళ్ళుగా చదువుతున్న మీకూ తెలుసు. ఏమిటీ నిష్కామ కర్మ అనిపిస్తుంది; ఎందుకూ ఇంత సమయం పెట్టి, ఇంత మందిని ఈ వేదిక మీద కూర్చోబెట్టి వొక పత్రికా ఎడిటర్ సాధించేదేమిటి? అని కూడా అనిపిస్తుంది. కిరణ్ ప్రభ, క్రాంతి గారూ ఇద్దరూ వొక్కో పత్రికని తీర్చిదిద్దడంలో ఎంత శ్రమపడుతున్నారో పత్రికని చూస్తేనే తెలిసిపోతూ వుంటుంది. ఇవాళ కౌముది నూరో సంచిక దాకా చేరుకోవడంలో అందులో రాసిన రచయితల కృషి ఎంత వుందో, ఆ కృషిని అందంగా అమర్చి, మన కళ్ళ ముందు నిలపడంలోనూ అంత శ్రమ సౌందర్యం వుంది.

వొక్కో సారి చదవడానికి కూడా తీరిక దొరకదు. కాని, చదవడం మొదలెడితే ఎప్పుడైనా ఎక్కడైనా ఆపాలంటే మనసు చివుక్కుమంటుంది. కథలూ, వ్యాసాలూ, కబుర్లూ, కవితలూ, శీర్షికలూ వేటికవే ప్రత్యేకంగా కనిపిస్తున్నప్పుడు వాటన్నిటిని గురించి వొక రెండు ముక్కల్లో చెప్పాలనుకోవడం సాహసమే!

మీ కృషి పది కాలాలు నిలవాలని, నలుగురికీ అందాలని, ఇంకా కొత్త రచయితలకు స్ఫూర్తి కావాలని మనసారా ఆకాంక్షిస్తూ..

❀❀❀❀

**ఆర్. శర్మ దంతుర్తి**

మొదట్లో, అంటే 2007 ప్రాంతంలో సరదాగా ఓ కధ రాసి – అనేకానేక అచ్చుతప్పుల్తో, అతికీ అతకని తెలుగు భాషలో ఒక పేరాకీ రెండో దానికీ అతుకుల్లేకుండా రాసి – ఎక్కడ పబ్లిష్ చేయాలో తెలీని రోజుల్లో గూగిలమ్మని చూస్తూంటే ఈమాటా, తెలుసా, కౌముదీ కనిపించేయి. ఏమాట కా మాటే చెప్పుకోవాలంటే అప్పట్లో నాకు లేఖిని గురించి గానీ, తెలుగు లో టైప్ చేయడం గురించిగాని తెలియనే తెలియదు. ఈ రాసిన చిత్తు ప్రతి ఎక్కడికి పంపాలా అని చూస్తే కౌముది వారి డబ్లిన్ ఎడ్రస్ దొరికింది. నమ్మండి

నమ్మకపోండీ, ఆ ఎడ్రస్ కి నా కాయితాలు నా స్వంత దస్తూరీతో రాసినవే పంపించేను. అవి చదివాక మళ్ళీ కిరణ్ ప్రభ గారినుంచి సమాధానం లేదు. సరే నేను రాసింది ఎలాగా చెత్తే కాబట్టి అక్కడికి ఊరుకున్నాను కానీ తెలుగులో టైప్ చేయడం, ఈమెయిల్లో పంపించడం ఆ తర్వాత రెండు నెలల్లో తెల్సుకుని మళ్ళీ కౌముదికి రాసిన చెత్తల్లా పంపించడం మొదలెట్టాను.

మొదటిగా వంగూరి ఫౌండెషన్ బహుమతి వచ్చినప్పుడు అది కౌముదిలో రాగానే "హమ్మయ్యా, నేనూ రాయగలనోయీ" అని ప్రోత్సాహం అందించింది కౌముది రావుగారే. జోకు ఏమిటంటే ఉత్తరోత్తరా నేను ఇక్కడో కథా అక్కడో కవితా రాస్తున్నా అవి ఎవడు చదువుతార్లే అని రెండు చేతుల్తో నోరు మూసుకుని కూర్చోడం అలవాటు చేసుకున్నాను. అప్పట్లో ఓ సారి మా ఆవిడ క్లాస్ మేట్ న్యూ జెర్సీలో ఉన్నావిడ ఇంటికెళ్తే వాళ్ళాయన అడిగేడు మా ఆవిణ్ణి – ఓ ఈ కౌముదిలో వచ్చే కథలు మీ ఆయన రాసేవేనా అని. ఆహా మనకో ఇద్దరు ముగ్గురు కథకులున్నారన్న మాట అని సంతోషం.

ఉత్తరోత్తరా మళ్ళీ మళ్ళీ రాయడం కౌముది వారూ ఈమాట వారూ వేసుకోవడంతో చెస్టు రెండంగుళాలు పొంగించి రాయడం మొదలెట్టాను. ఇన్నేళ్లలో ఏనాడూ కూడా కౌముది నుంచి, "మీ కథ దరిద్రంగా ఉందీ, వేసుకోమూ" అన్న మాటే లేదు. ఇదేమిటో ఈయన నేను రాసినవన్నీ వేసేసుకుంటున్నారు, ఇంక మెటీరియల్ ఏమీ లేదు కాబోలు అనుకుంటూ ఉండేవాణ్ణి. అటువంటి రోజుల్లో ఓ డెంటిస్ట్ మీద కథ రాసి పంపితే 'వేసుకోమూ' అని ఖచ్చితంగా చెప్పేసారు. "ఆ, ఈయన మెతగ్గా ఉన్నా నేను పంపించినవన్నీ క్షుణ్ణంగా చదువుతారన్నమాట" అని తెలిసొచ్చింది అప్పుడే.

తర్వాత నేను రాయడం మొదలుపెట్టినన్నింట్లోనూ తప్పు దిద్దడం, గ్రామర్ దిద్దడం అదీ చూసే సరికి రావుగారూ కాంతి గారూ చేసే పని తెలిసొచ్చింది. ఇప్పటికీ వచ్చే కథలన్నీ చదవడం, తప్పులు కానీ అవీ చూడడం సాధారణంగా రెండు రోజుల్లో సరిగ్గా సమాధానం ఇవ్వడం చూస్తూంటే అసలు ఈయన వేరే ఉద్యోగం చేస్తున్నారా? చేస్తే ఈయనకి ఇదంతా చేయడానికి టైం ఎక్కడ దొరుకుతోందీ అనే ప్రశ్నలు రావడం సహజం.

జీతం తీసుకుని ఎడిటర్ పని చేయడం వేరూ, లాభాపేక్ష లేకుండా చేయడం వేరూను. అంతెందుకు ఓ సారి వీక్షణం విశేషాలు చూడండి. ఓ సారి వెళ్తాం, రెండుసార్లు వెళ్ళొచ్చు. కానీ ప్రతీసారి వెళ్ళాలంటే ఆ పోదురూ అదంతా బోరు అని మానేస్తాం. కానీ వీక్షణం చూస్తే అందులో రావు గారి లేని ఫోటో ఒక్కటైనా ఉందా? అదే మనసుండి చేయడం అంటే.

మెల్లిగా కౌముది "పూర్తిగా" చదవడం అలవాటుచేసుకున్నాక మధురవాణి గారి అమెరికా డైరీ అవీ చదివితే ఓహో ఈయన మంచి హోస్టే. ఈయనింట్లో మారుతిరావు గారి దగ్గర్నుంచి, మధురవాణిగారూ అందరూ ఉన్నారన్నమాట అనిపించి సంతోషం వేసింది. ఎప్పటికైనా మళ్ళీ ఇంకోసారి కాలిఫోర్నియా వెళ్లకపోతానా, వీళ్ళింటికెళ్ళి విస్తరి వేయకపోతానా అని ఆశ. నూరు సంచికలు పూర్తిచేసుకున్న కౌముదికి మళ్ళీ ఇటువంటి నూరు సంచికలు శతకోటి పూర్తిచేసుకోవాలని శుభాకాంక్షలతో...

****

**క్రాంతి సి.హెచ్**

ఉద్యోగంలో చేరిన క్రొత్తల్లో, పెద్దగా పనీ పాటా ఏమీ లేని రోజుల్లో, అంతర్జాలంలో తెలుగు కథలు/నవలలు ఏమైనా చదువుదామని వెతుకుతున్నప్పుడు ఒక స్నేహితుడి ద్వారా పరిచయమైంది కౌముది. బావుందే పేరు అనుకుంటూ, చదవడం మొదలుపెట్టా. మొదట్లో మరీ అంత రెగ్యులర్గా కాదు కానీ, అడపదడపా చదువుతూ ఉండేదాన్ని.

ఈ వరుసక్రమాన్ని మార్చిన నవల: "ఊసులాడే ఒక జాబిలట"! ఆ నవల ప్రారంభం మొదలు, చివరి వరకూ ఎప్పుడు ఒకటో తారీఖు వస్తుందా అని ఎదురుచూడడమే! జీతం కూడా 28నే వచ్చేసేది కానీ నవల కోసం నెల మొదటి వరకూ ఆగాల్సిందే. ఎదురు చూపులైనా కూడా నిషిగంధ గారి ఊసులు కదా, చాలా తీయగా ఉండేవి!

అలా అలవాటైన కౌముది ప్రయాణం, క్రమం తప్పకుండా కొనసాగుతూనే ఉంది. విప్లవ్ గారి రచనలు, రమణి గారి కబుర్లు, చిట్టెన్ రాజు గరి కట్టు కథలు, ఒహటేమిటి చాలా ఉన్నాయి. కొవ్వలి గారి రచనల గురించి, కౌముదిలోనే తెలుసుకున్నా.

కథలు, నవలల గురించి ప్రక్కన పెడితే, ఒక్క నెల కూడా తారీఖు తప్పకుండా పత్రిక రావడం, ప్రచురించిన వాటిల్లో నాణ్యత, ఆలోచింపజేసే కవితతో కూడి ఉన్న అందమైన ముఖ చిత్రం అన్నీ ఇలా సమపాళ్ళలో ఉండడం వెనుక, కిరణ్ ప్రభ గారి, కాంతి గారి శ్రమ ఎంతో ఉంది. Hats off to Kiran Prabha గారు, Kanthi Kiran Pathuri గారు..

కిరణ్ ప్రభ గారు తన రేడియో కార్యక్రమంలో చెప్పినట్లు, మైలురాళ్ళు అనేవి మనకు సూచికలు. ఇప్పటివరకు జరిగిన ప్రయాణాన్ని బేరీజు వేసుకుంటూ, ఇక ముందు అవసరమైన మార్పులని చేసుకుంటూ ముందుకు సాగడం కోసమే ఈ సూచికలు. I am sure, KOUMUDI WEB MAGAZINE is going to reach many more milestones like this!

Once again hearty congratulations to Kiran Prabha గారు, Kanthi Kiran Pathuri గారు, for this wonderful achievement !!

**ఉమ యేలూరి**



వెన్నెలతో అనుభంధం ఏనాటిదంటే ఏమి చెపుతాము.. తోట ఒడ్డున తెలి రాగాలతో పున్నాగ ఒకటి రాతిరి వెన్నెలను పొదివి పట్టుకొని లోకానికి విసిరే హడావుడి లో ఉన్నప్పుడు, వెన్నెలంటే నీకెందుకంత ఇష్టం అంటే తెల్లబోయి చూడటం తప్ప ఏమి చెప్పగలదు అలానే అనిపించింది నాకు కౌముది తో నా అనుభందాన్ని చెప్పమంటే... మఖతా పరిచయం లేకపోయినా చదువుకునే రోజులలోనే కేవలం కిరణ్‌ప్రభ గారి కవితలకోసం పల్లకి, మయూరి ఇంకా ఏ పుస్తకం లో పడితే ఆ పుస్తకమే కొనో/అద్దెకో తెచ్చుకునే దాన్ని. ఆ కాగితాలన్ని కలిపి కుట్టుకుని ఇంకా బడ్జెట్ ఉంటే బైండింగ్ చేయించుకుని చదివే రోజులనుంచి సర్వాలంకారభూషిత గా మన కౌముది మన ముందుకు వచ్చేవరకు నా అనుభంధం వేరే ఒక కథ లా రాయొచ్చు, కాని ప్రస్తుతం కౌముది తో నా అనుభంధం రాయలనుకుని ఇలా పక్క దారి ఎందుకు అని కేవలం కౌముది తో నా అనుభంధం రాయాలని నా ఈ ప్రయత్నం.

కౌముది అనగానే చల్లని కాంతి పలకరింపు , చిరునవ్వులు వెదజల్లే స్నేహపూర్వకమైన తన రూపమే గుర్తు వొస్తుంది నాకైతే. ఆ తరువాతే ఎవ్వరిని నొప్పించని కిరణ్‌ప్రభ గారి మెత్తటి పలకరింపు, రచనలను ఎన్నుకునే ఆయన నిపుణత, మనసులోతులను స్పృశించే వెన్నెల కన్నా మెరుపులను, వసంతపు పూల సుగంధాలకన్నా పరిమళాలను పరిచయం చేసే వారి కవితలు గుర్తు వొస్తాయి. ఆన్‌లైన్ లో వొచ్చే పుస్తకమైనా... ఊరికే (ఫ్రీ గా) చదవగలిగే పుస్తకమైనా... అటువంటి భావమే మనకు రాకుండా, ఏదంటే అది ప్రచురించకుండా ప్రతి శీర్షికలో నూ వారిద్దరు తీసుకునే జాగర్త, ప్రతి కవితను, కథ ను ప్రేక్షకుల స్థాయి నుంచి పరిశీలించి, విమర్శకుల కన్నుతో చూసి, సంపాదకుల సామర్ధ్యతతో విశ్లేషణాత్మక నిర్ణయం తీసుకోగల వారి సామర్ధ్యమే ఈ రోజుకు 100 సంచికల తరువాత కూడా కౌముది వచ్చే రోజు కోసం, మొదటి సంచిక కోసం ఎదురుచూసిన క్షణపు ఆత్రుతనే మా అందరిలో నిలబెడుతోంది అనుకుటా నేను.

అటువంటి కౌముది లో నీవు రాయకూడదూ, నువ్వు ఉత్తరాలు, పొద్దుటే శుభోదయాలు ఎంత బాగా రాస్తావు అని కాంతి ప్రోత్సహించి నాకోసం లేఖాయణం అని ఒక శీర్షిక పెట్టి ఆఖరి నిమిషం వరకు రాయని నా తిక్క ను ఒక్క మాట కూడా అనకుండా భరించి నా శీర్షిక దాదాపు సవత్సరం వేసి, ముందు చెప్పకుండా ఇంక రాయను అని ఆపేసినా నన్ను ఒక్క మాట అనకుండా క్షమించిన నా మంచి మిత్రురాలు కాంతి తో, కౌముది తో నా అనుభందం ఏమి చెప్పనూ!

డొక్కా ఫణి గారి మాట తెలుగు ఒన్ రేడియో లో విన్నప్పుడు ఓ ఈయన మన హాస్య కౌముది లో కడుపుబ్బ నవ్వించే ఫణి గారే కదా అనో... సుభద్ర గారిని ఫేస్ బుక్ లో చూసి ఓ ఈమె మన అగ్రహారపు కథలు చెప్పే సుభద్ర వేదుల గారు కదూ అనో, ఏదో సినిమా చూస్తూ రచన బలభద్రద్రపాత్రుని రమణి అని చూడగానే ఈమె కు సూపర్ సెన్స్ ఆఫ్ హ్యూమర్ తెలుసా కాలమ్ దాటని కబుర్లతో ప్రతి నెల తెగ నవ్విస్తూనే బుర్ర గోక్కునేట్టు చురకలూ వేస్తూ ఉంటారు అని ఏదో ప్రత్యేక పరిచయం ఉన్నట్టు పక్కనోళ్ళకు చెప్పటం... ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఒక్కరితో కౌముది కుటుంబం లో పాత్రలు గా, ఆ రచనా స్రవంతి లో మునకలేస్తున్న ఒత్సాహికులు గా ఎన్నైనా ఎంతైనా చెప్పగలం.

అన్నిటికంటే ముఖ్యం గా కౌముది రాగానే... చిన్నప్పుడు పల్లకి రాగానే కాగితాలన్నీ పరా పరా తిప్పేసి ముందు గా కిరణ్‌ప్రభ గారి కవిత చదివేసి, ఆ పైన ఆ కవిత కోసం వేసిన పువ్వో, ఒక అమ్మాయి నవ్వో కాసేపు చూసి, ఆ పైన కవితలో ని భావం నెమ్మది గా మనసుని కమ్మెయ్య గానే పుస్తకం పక్కన పడేసి ఆ అదును కోసం చూసే మా అమ్మ వంక ఉదారం గా చూసి ఇచ్చేసి, ప్రతి వారం ఒక విందు కోసం మనసు ఉరకలేసినట్టు గానే... ఇప్పుడూ ప్రతి నెలా ముందు నా చిట్టెలుక ను (మౌస్) ను అడ్రెస్ బార్ లో మళ్ళించి అడ్రెస్ టైపు చెయ్యగానే ఒక అందమైన కల కళ్ళ ముందు పరుచుకుంటుంది. అంత చక్కటి ముఖచిత్రం వెనుక గా పలకరిస్తున్నా, ముందు కళ్ళు కవిత వెంబడి పరిగెడతాయి, ఆ పైన ఆ చిత్రం చూసి కాసేపు నాదైన లోకం లో చిరు మునక వేసి, వెంబడే సంపాదకీయం నొక్కి దాన్ని ఆసాంతం చదివేసి... నెమ్మది గా కాసేపు ఆ పదాల భందమో , అందులోని ఆర్ధతో, ఆ మాటలలోని అంతర్లీనం గా ఆలోచింపచేసే సందేశమో మనసును పరాకు గా చేస్తే, కాసేపు కంప్యూటర్ ను పక్క కు జరిపేస్తా నేను.. ఆ పైన వీలును బట్టీ, నా ఇష్టాన్ని బట్టి ఒక సారి నవ్వుల కాలం తో మొదలు పెడితే, ఇంకోసారి ఆసక్తి గా ఎదురు చూస్తున్న సీరియల్ తోనో లేదా ఎవరి కథో గబుక్కున కళ్ళ ను కలిపితే ఆ దారి వైపుగానో, ఇలా ఇష్టానుసారం జరిగినా ముందు మాత్రం ఆ కవిత, సంపాదకీయం మీది ఆసక్తి ని అలానే 100 సంచికల నుంచి నిలబెట్టుకుంటూ ఒస్తున్న కిరణ్‌ప్రభ గారి ప్రతిభే కౌముది ని ఇప్పటికి ఎప్పటికి ఆన్‌లైన్ సంచికలలో మున్ముందు గా నిల బెడుతుంది.

ఇలా రాస్తూ పోతే చెప్పటానికి బోలెడన్ని విషయాలు ఉన్నాయి నా దగ్గర కాని సంక్షిప్తతే కథ కైనా కవిత కైనా మాట కైనా ముఖ్యమనే సూత్రానికి అయిష్టం గా తలూపుతూ ఆపేస్తున్నా.. కృష్ణపక్షమే లేని మా కౌముది వెన్నెలలు ఎప్పటికి మా మీద ఇలా ప్రసరిస్తూ ఉంటాయని ఆశిస్తూ, ఆ ప్రయత్నం లో వారి అత్యంత విలువైన కాలాన్ని మా కోసం వెచ్చిస్తున్న మా కాంతి, కిరణ్‌ప్రభ ల గార్లకు మనఃపూర్వక నమఃసుమాంజలులతో

ఎప్పటికి మీ స్నేహితురాలినని గర్వపడుతూ